

చింతలపూడి లిఫ్ట్‌ను ఆపింది జగనే



కొయ్యలగూడెం వారాహి సభలో ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌ను పరిచయం చేస్తున్న పవన్, చిత్రంలో కరాటం రాంబాబు, పోలవరం, చింతలపూడి అభ్యర్థులు బాలరాజు, రోషన్ తదితరులు

- ఏజెన్సీ ప్రజల కష్టాలు తెలిసిన వాడిని
- పోలవరం నిర్వాసితులకు అండగా ఉంటా
- పోలవరం జిల్లా ఏర్పాటుపై చర్చిస్తా
- ఉమ్మడి మేనిఫెస్టోపై అన్ని వర్గాలు సంతృప్తి
- ఉద్యోగుల శ్రేయస్సే మా ప్రభుత్వ లక్ష్యం
- కొయ్యలగూడెం వారాహి సభలో పవన్



ఏలూరు/కొయ్యలగూడెం/నిడమర్రు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి):చింతలపూడి లిఫ్ట్ ఆపింది ముమ్మాటికీ జగనేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ విమర్శించారు. పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెంలో మంగళవారం వారాహి విజయయాత్ర సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. 'ఈ ప్రాంతమంటే నాకు ఎంతో మక్కువ. రాజకీయాలలోకి రాక ముందు నుంచి కరాటం రాంబాబు గారితో పరిచయం వుంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఆయన ఎంతో కృషి చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉండగా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టేటప్పుడు 110 ఎకరాలు నిర్వాసితులకు ఇవ్వడానికి త్యాగం చేశారు. వారి పరిచయంతో నేను యుక్త వయసులో పోలవరం, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం అడవుల్లో సంచరించేవాడిని. అప్పుడే ఏజెన్సీ ప్రజల కష్టాలు చూసి చలించిపోయా. ఏనాడు ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాని రాంబాబు నా కోసం జనసేనలో చేరి, ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కష్టాలను ఎదుర్కొంటున్న పోలవరం నిర్వాసితులకు అండగా నిలబడాలన్నారు. జగన్ కుల కక్ష వల్లే చింతలపూడి లిఫ్ట్‌ను ఆపేశాడు. అతను అమరావతిని కట్టలేదు, చింతలపూడిని కట్టనివ్వలేదు. కొన్ని కులాలకు లబ్ధి చేకూరుతుందనే జగన్ ఇదంతా చేశాడు.

జగన్‌కు ఓటేసి గెలిపిస్తే మనకు వారసత్వంగా వచ్చే భూములుండవు. పాస్ పుస్తకాలపైన, సరిహద్దు రాళ్లపైన జగన్ బొమ్మ ఎందుకు.. మన ఆస్తుల ఒరిజినల్స్ వారి వద్ద ఉంటాయట.. మన ఆడ పిల్లలకు ఆస్తి పత్రాల కింద జిరాక్స్‌లు ఇవ్వాలట.. ఈ జిరాక్స్ పత్రాలతో ఏ బ్యాంకు వాడైనా, వడ్డీ వ్యాపారియైనా మనకు అవసరానికి అప్పు ఇస్తాడా ? ఐదేళ్లకే ఇంత విధ్వంసం మరో ఐదేళ్లు భరించలేం.

మేనిఫెస్టోతో సంతృప్తి

చంద్రబాబు, నేను, సిద్ధార్థ్ కలసి ఉమ్మడి మేనిఫెస్టో రూపొందించాం. అన్ని వర్గాలను సంతృప్తి చేసేలా ఉంది మన మేనిఫెస్టో. పేదల నుంచి సంపన్నులను చేయడమే లక్ష్యంగా మన ప్రభుత్వం పని చేస్తుంది. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్స్ చేస్తాం. ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమా వర్తింప చేస్తాం. 75% ప్రజలు కోరుకుంటే ఆ గ్రామంలో మద్యపానం నిషేధిస్తాం. విషపూరిత మద్యంను రానివ్వం. చెత్త పన్ను రద్దు చేస్తాం. ఉద్యోగుల శ్రేయస్సే మా ప్రభుత్వ లక్ష్యం. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిని పునరుద్ధరించి వారిని ఆదుకుంటాం. పోలవరం నియోజకవర్గ సమస్యలు పరిష్కరిస్తాం. జిల్లా ఏర్పాటుకు కృషి చేస్తాం. కొయ్యలగూడెంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హాస్పటల్, ఫైర్‌స్టేషన్, పోలీస్ స్టేషన్ చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ రావాలంటే జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి. అలాగే ఉద్యోగుల శ్రేయస్సే మా లక్ష్యం. ఆ దిశగా ఉద్యోగులకు రావాల్సిన డీఏ, టీఏ, పీఆర్సీలను సకాలంలో అందిస్తాం. ఎర్న్ లీవ్‌లను అందిస్తాం. మీరు నా కోసం.. నేను మీ కోసం.. పోలవరం, చింతలపూడి, గోపాలపురం నియోజకవర్గాల కూటమి అభ్యర్థులకు ఓటేసి గెలిపించండి' అంటూ పవన్ కోరారు.

పోలవరం పూర్తికి కృషి చేస్తా

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేస్తామని ఏలూరు కూటమి ఎంపీ అభ్యర్థి మహేష్ యాదవ్, పోలవరం కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు హామీ ఇచ్చారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి పార్లమెంట్, అసెంబ్లీలో గళం విప్పుతామని ప్రజలకు హామీ ఇచ్చారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పూర్తవ్వాలంటే పవన్‌కల్యాణే సమర్థుడని కొనియాడారు. అందుకే పోలవరం టిక్కెట్టును జనసేనకు తీసుకున్నారన్నారు. టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ మెట్ట ప్రాంతం సస్యశ్యామలం అవ్వాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. పవన్‌కల్యాణ్ సభకు వేలాదిగా తరలివచ్చారు.





దెందులూరు సభలో మాట్లాడుతున్న చంద్రబాబు.. ఇన్‌సెట్‌లో ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్, వంగవీటి రాధా, దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని

కొల్లేరు కాంటూరు కుదిస్తాం

ప్రజల హర్షధ్వానాల మధ్య చంద్రబాబు ప్రకటన

చంద్రబాబుకు ఘన స్వాగతం.. రోడ్ షో అదుర్స్.. కిటకిటలాడిన దెందులూరు

పెదవేగి/ దెందులూరు, ఏప్రిల్ 30 : 'కొల్లేరు ప్రజల చిరకాల కోరిక కాంటూరును కుదిస్తాం. కొల్లేరు అభయారణ్యం పరిధిని ఐదో కాంటూరు నుంచి మూడో కాంటూరుకు కుదించేందుకు కేంద్రంతో మాట్లాడి పూర్తిచేస్తా'నని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. దెందులూరులో సోమవారం ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్, దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌లతో కలసి ప్రజాగళం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఆక్వా రైతుల బాధలు తెలుసు. ఆక్వాకు రూపాయిన్నరకే విద్యుత్‌ను అందిస్తా. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీపై సంతకం చేస్తాను. ఐదేళ్లుగా రాయితీలు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. బిందుసేద్యానికి 90శాతం రాయితీపై పరికరాలు అందిస్తాం. పామాయిల్ పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తాం. దెందులూరు వైసీపీ ఎమ్మెల్యే తండ్రీ, కొడుకులు వసూళ్లకు తెరలేపారు. పోలవరం కుడి కాల్వ గట్లను దోచేశారు. గట్టు కొట్టేయడంతో భవిష్యత్‌లో వరద ప్రమాదం పొంచి ఉంది. పోలవరం గట్లు కొట్టిన వారిని జైల్లో పెట్టినా తప్పు లేదు. దెందులూరును దందాల ఊరుగా మార్చేశారు. దాడులు, దౌర్జన్యాల సంస్కృతికి తెరలేపారు. ఎర్రిపప్ప తన కొడుకును ఎంపీ అభ్యర్థిగా పంపించాడు. ఓటర్లు ఆయనను ఎర్రిపప్పను చేసి పంపించండి. ఎంపీ, ఎమ్మెల్యేలతో పనులు చేయించే బాధ్యత నాది.. ఓట్లు వేసి గెలిపించే బాధ్యత మీది.. లండన్‌బాబు వచ్చాడు.. ఐటీ కంపెనీలు తెస్తాడని అంతా ఎదురు చూశారు.. కానీ ఒక్క కంపెనీ అయినా తెచ్చాడా..? పేకాట కంపెనీని మాత్రం తీసుకొచ్చాడు. మీ ఈలలు ఓట్లుగా మారాలి. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకుంటే ప్రజల సంక్షేమం సాధ్యపడుతుంది' అంటూ చంద్రబాబు స్పష్టం చేశారు. చింతమనేని మాట్లాడుతూ తనను నమ్మి రెండుసార్లు గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు మళ్లీ చంద్రబాబు నాకు అవకాశం కల్పించారని, మళ్లీ గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పోలవరం కాల్వ ద్వారా రెండు లిఫ్టులను ఏర్పాటు చేసి అందించాలన్నారు. ఏలూరు రూరల్ మండలంలో కృష్ణ కాల్వలో వస్తున్న మురుగు వ్యర్థాలను తాగునీరుగా అందించాల్సిన పరిస్థితి ఉందనడంతో స్పందించిన చంద్రబాబు మనం అధికారంలోకి రాగానే రెండు లిఫ్టులను మంజూరు చేస్తామన్నారు.



రోడ్ షోకు విశేష స్పందన

సాయంత్రం మూడు గంటలకు ప్రజాగళం రోడ్ షోకు చంద్రబాబు దెందులూరు రావాల్సి ఉండగా నాలుగు గంటల 53 నిమిషాలకు హెలీకాప్టర్‌లో ల్యాండ్ అయ్యారు. ఆయనకు టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. కాన్వాయ్‌లో ప్రజాగళం రోడ్ షో వద్దకు 4:59కి చేరుకున్నారు. 5:02 గంటలకు ఎన్టీఆర్ విగ్రహం వద్ద ప్రచార సభలో 5:45 గంటల వరకు మాట్లాడారు. చంద్రబాబు నాయుడు నిర్వహించిన రోడ్డు షోకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు మద్దతు తెలిపారు. దీనిపై చంద్రబాబు మాట్లాడుతూ జిల్లాల వారీగా మాదిగ, మాల సోదరులకు ఇబ్బందులు లేకుండా వారి సమస్య పరిష్కరిస్తానన్నారు. తెలుగుదేశం జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఘంటశాల వెంకటలక్ష్మి, కొఠారు ఆదిశేషు, సంబంగి వేణుగోపాలతిలక్, మాగంటి నారాయణప్రసాద్, తోట ఏసమ్మ, పెనుబోయిన శేషారత్నం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మూడు నెలల్లో 2800 ఉద్యోగాలు : పుట్టా

- ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ మాట్లాడుతూ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో తొమ్మిది ఇండ్రస్ట్రీలను తీసుకువస్తానని, మూడు నెలల్లో గ్రీన్ కంపెనీని తీసుకువచ్చి 2,800 మందికి ఉద్యోగాలు అందిస్తా మన్నారు. దెందులూరులో బలమైన నేత చింతమనేని కావడంతో ఆయనపై 43 కేసులు పెట్టారని, తనతోపాటు చింతమనేనిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.
- వంగవీటి రాధ మాట్లాడుతూ తనకు పదవి మీద ఆశ లేదని, తన తండ్రి రంగా పేదలందరి ఇళ్లు, ఇళ్ల స్థలంతో పాటు వారు ఆర్థికంగా బలంగా ఉండాలన్న ఆశయాల సాధన కోసం తాను అభివృద్ధి చేయగలిగిన ముందుచూపు కలిగిన నాయకుడు చంద్రబాబును నమ్మి కూటమికి మద్దతు తెలుపుతున్నానన్నారు. చంద్రబాబు మాట్లాడుతూ దెందులూరు సాక్షిగా చెబుతున్నా.. మంచి నాయకుడైనా వంగవీటి రాధా భవిష్యత్తు నాది, అతన్ని అన్ని విధాలుగా అవకాశాలు కల్పించి ఆయన తండ్రి రంగా ఆశయాలు నెరవేరుస్తామన్నారు.

నియమ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి

ఏలూరు సిటీ, ఏప్రిల్ 30 : ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలు, నియమ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్నవెంకటేష్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు డా. కృష్ణకాంత్ పాఠక్, ఎస్ఎ రామన్ , వ్యయ పరిశీలకులు షేరింగ్ జోర్డాన్ భూటియా , పి కీర్తి నారాయణ్ , మెశ్రమ్ గౌరవ్ మధుకర్ , పోలీస్ పరిశీలకులు టిశ్రీధర్ కలిసి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికలు సజావుగా జరిగేలా జిల్లా యంత్రాగానికి సహకరించా లన్నారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సన్నద్ధత కోసం జిల్లా యంత్రాంగం చేపడుతున్న కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఎన్నికల సాధారణ, వ్యయ పరిశీలకులకు వివరించారు. మంగళవారం కలెక్టరేట్ లోని గౌతమి సమావేశ మందిరంలో జిల్లాకు నియమించబడిన సాధారణ పరిశీలకులు డా.కృష్ణ కాంత్ పాఠక్, ఎస్ఎ రామన్ ఇతర వ్యయ పరిశీలకులతో కలిసి కలెక్టర్ ఆర్వోలు, ఎన్నికల నోడల్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు 2108 పీవోలు, 2129 ఏపీవోలు, 8243 మంది ఇతర పోలింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు.

గ్లాస్ గలాటా..!



- జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో ఇండిపెండెంట్‌లకు గ్లాసే
- ఇప్పుడు దీనిపైనే గందరగోళం
- హైకోర్టు ఆదేశాల కోసం జనసేన ఎదురుచూపు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఏలూరు జిల్లాలో ఐదు నియోజక వర్గాల్లో ఇండిపెండెట్‌లకు గ్లాస్ గుర్తు కేటాయించడం గందరగోళానికి దారి తీస్తోంది. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో నాలుగు అసెంబ్లీ స్థానాల్లోనూ, ఏలూరు లోక్‌సభ స్థానంలో ఇండిపెండెంట్‌లకు జనసేన గుర్తు కేటాయించారు. జనసేన పార్టీ అభ్యర్థులు ఇప్పటికే గ్లాస్ గుర్తుతో ఎన్నికలు ప్రచారం చేస్తున్నారు. నామినేషన్ ప్రక్రియకు చివరి రోజు అయిన సోమవారం పోలవరం, ఉంగుటూరు నియోజక వర్గాల్లో బరిలో ఉన్న జనసేన అభ్యర్థులకు గ్లాస్ గుర్తులు కేటాయించారు. సమాంతరంగా నూజివీడు, కైకలూరు, చింతలపూడి, దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఇండిపెండెంట్ అభ్యర్థులకు ఇదే గ్లాస్ గుర్తు కేటాయించడం గందరగోళానికి దారి తీస్తోంది. ఎక్కడైనా జనసేన అభ్యర్థి లేరో అక్కడ గ్లాస్ గుర్తు కేటాయింపు జరిగినట్టు ఎన్నికల అధికారి చెబుతున్నా దీని ప్రభావం ఎంపీ అభ్యర్థిపై పొడచూపుతుందన్న అనుమానం లేకపోలేదు.

ఎందుకిలా జరిగింది..

ఒక గుర్తింపు పొందిన రాజకీయ పార్టీకి ఒక ఎన్నికల గుర్తు కేటాయిస్తే ఈ గుర్తుకు సమాంతరంగా ఇండిపెండెంట్‌లకు, మరే ఇతర రాజకీయ పార్టీలకు అదే గుర్తు కేటాయించి పునరావృతం చేయడం జరగదు. జనసేన పార్టీ కేవలం రిజిస్ట్రర్ పార్టీగానే ఉన్నందున గత ఎన్నికల్లో తగినంత ఓట్లు దక్కక ఎన్నికల సంఘంలో గుర్తింపు పొందలేదు. జనసేన పార్టీకి ఇంతకుముందు కేటాయించిన గ్లాస్ గుర్తు ఎవరైతే ఆ పార్టీ అభ్యర్థులుగా రంగంలో ఉంటారో వారికి మాత్రమే ఆ గుర్తు కేటాయిస్తూ వచ్చారు. ఈసారి ఎన్నికల్లో మాత్రం ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే అభ్యర్థి ఇండిపెండెంట్‌లు కోరుకుంటే గాజు గ్లాస్ గుర్తు వారికి కేటాయించారు. ఏలూరు ఎంపీ స్థానానికి 13 మంది అభ్యర్థులు నామినేషన్‌లు వేశారు. కూటమి పక్షాన టీడీపీ బలపరిచిన మహేష్ కుమార్ యాదవ్ ఎంపీ అభ్యర్థిగా ఉన్నారు. అయితే ఇండిపెండెంట్‌గా ఉన్న బొకినాల కోటేశ్వరరావుకు గ్లాస్ గుర్తు కేటాయించారు. ఇప్పటికే కూటమి అభ్యర్థిగా ఉన్న మహేష్ యాదవ్ ప్రచారంలో సైకిల్, కమలం, గాజు గ్లాస్ గుర్తులు మూడింటిని విస్తృతంగా ఓటర్ల ముందుకు తీసుకెళ్లుతున్నారు. ఇప్పుడు ఇండిపెండెంట్ అభ్యర్థికి కూడా గాజు గ్లాస్ గుర్తు కేటాయిస్తే ఓటర్లలో గందరగోళం ఏర్పడుతుందన్నది అందరిలోనూ నెలకొన్న సందిగ్ధత. అసెంబ్లీ నియోజక వర్గాలకు వచ్చేసరికి పోలవరంలో చిర్రి బాలరాజు, ఉంగుటూరులో పత్సమట్ల ధర్మరాజు జనసేన కూటమి పక్షాన రంగంలోకి దింపింది. వీరిద్దరికి గ్లాస్ గుర్తు కేటాయించారు. మిగిలిన నియోజక వర్గాల్లో ఇండిపెండెంట్‌లకు గ్లాస్ గుర్తు కేటాయించడం రాజకీయ గలాటాకు దారి తీస్తోంది. దెందులూరు నియోజకవర్గ పరిధిలో ఇండిపెండెంట్‌గా ఉన్న పల్లి రమేష్, ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థి మత్తె బాబి, కైకలూరులో ఇండిపెండెంట్ అభ్యర్థి మాదాసు సత్యనారాయణ, చింతలపూడి నియోజకవర్గంలో మొవ్వల ఎస్తేరు రాణికి గాజు గ్లాస్ గుర్తు దక్కింది. అంటే ఒక్క ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలోనే దాదాపు అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల్లోనూ గాజు గ్లాస్ గుర్తు ఉంటుంది. దీనిపైనే కూటమిలోనూ తీవ్ర తర్జన భర్జన జరుగుతోంది. కూటమి పక్షాన ఇప్పటికే మూడు చిహ్నాలతో విస్తృతంగా ప్రచారం చేసినందున ఇదంతా కూడా జనం మధ్యకు వెళ్లింది. ఇలాంటి తరుణంలో ఇండిపెండెంట్‌లకు గ్లాస్ గుర్తు కేటాయించడం గుండె గుభేలుమనేలా చేసింది.

ఇప్పుడు ఏం చేయబోతున్నారు..

గ్లాస్ గుర్తు తమ పార్టీదని జనసేన వాదిస్తూ ఎన్నికల చిహ్నాల కేటాయింపులో ఇండిపెండెంట్‌లకు గ్లాస్ గుర్తు కేటాయించడంపై ఇప్పటికే జనసేన రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై బుధవారం విచారణ జరగబోతుంది. ఇప్పటికే గుర్తు ఇండిపెండెంట్‌కు కేటాయించిన కారణంగా ఎలాంటి ప్రభావం కూటమి అభ్యర్థులపై పడుతుందన్న తర్జన భర్జన జరుగుతోంది. అది కాకుండా ఎంపీ స్థానంలోనూ ఇండిపెండెంట్‌కు ఇదే గుర్తు కేటాయిస్తే దీని ప్రభావం పూర్తిగా ఎంపీ అభ్యర్థిపై పడుతుందని కొందరు అంచనా వేస్తున్నారు. జనసేన గుర్తు గాజు గ్లాస్‌గా అట్టడుగు స్థాయిలోనూ ఓటర్ల మదిలో ఉంది. హైకోర్టు ఇచ్చే ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు ఉంటాయన్న నమ్మకంతో కూటమి అభ్యర్థులు ఉన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్

- తండ్రీ కూతురు మృతి... భార్య, కుమారుడికి తీవ్ర గాయాలు
- తాళ్లమూడి వద్ద జాతీయ రహదారిపై ప్రమాదం
- విజయవాడ గుడికి వెళ్లి వస్తుండగా విషాదం



రుద్రరాము కుటుంబ సభ్యులు.. (ఫైల్) సర్కిల్‌లో మృతి చెందిన రుద్రరాము, రక్షశ్రీ

పెదపాడు, ఏప్రిల్ 30 : దైవ దర్శనం చేసుకుని ఆనందంతో ఇంటికి తిరిగి పయనమైన వారి ఆనందం మార్గమధ్యలోనే ఆవిరైంది. రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు ఆ కుటుంబ పెద్దను, కూతురును పొట్టన పెట్టుకోగా, భార్య, కుమారుడు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషాద ఘటన పెదపాడు మండలం తాళ్లమూడి వద్ద జాతీయ రహదారిపై ఉదయం 9 గంటల సమయంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉంగుటూరు మండలం కైకరం గ్రామానికి చెందిన ఏవ్వారి రుద్రరాము (33) అద్దె ఇంటిలో నివాసముంటూ రాడ్‌బెండింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం తెల్లవారు జామున ఐదు గంటలకు భార్య శిరీష (30), కుమారుడు సాయి దర్శిక్ (7), కుమార్తె రక్షశ్రీ (9) తో కలిసి మోటారు సైకిల్‌పై విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకుని తిరిగి ఇంటికి బయలు దేరారు. మార్గమధ్యలో తాళ్లమూడి వద్ద ప్రమాదవశాత్తు మోటారు సైకిల్ డివైడర్‌ను ఢీకొనడంతో రుద్రరాము, కుమార్తె రక్షశ్రీ అక్కడికక్కడే మృతి చెందగా, భార్య శిరీష, కుమారుడు దర్శిక్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఏలూరు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పెదపాడు పోలీసులు ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి పెదపాడు ఎస్సై కె.శుభశేఖర్ దర్యాప్తు చేస్తున్నారు.



జగన్మాయ

నూజివీడు మామిడికి హామీల తెగులు




నూజివీడు నియోజకవర్గంలో ప్రతిపక్ష నాయకుడిగా జగన్ పాదయాత్రలో హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు మరిచిపోయారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రసిద్ధ నూజివీడు మామిడి చేదెక్కింది. 200 ఎకరాల్లో మ్యాంగ్ పల్ప్ యూనిట్ ఏర్పాటు హామీ రైతులకు ప్రయోజనంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఆశించారు. ఆ దిశగా ప్రభుత్వం, పాలకులు ఏవిధమైన చర్యలు తీసుకోలేదు. కేంద్రీయ విశ్వ విద్యాలయం ఏర్పాటు హామీ అమలుకు ప్రయత్నించినా నిరాశే కలిగింది. ట్రిపుల్ ఐటీ సమస్యలు పరిష్కరిస్తానని, మెంటార్లను క్రమబద్ధీకరిస్తామని జగన్ ఇచ్చిన హామీ ఐదేళ్లలో అమలుకు నోచుకోలేదు. ప్రధానంగా వరి సాగుకు కీలకమైన అవసరమైన చింతలపూడి ఎత్తిపోతల పథకంలో పాలకుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది.

– నూజివీడు

- మ్యాంగో పల్ప్ యూనిట్ అడ్రస్ లేదు
- ట్రిపుల్ ఐటీ సమస్యలు గాలికొదిలేశారు
- రహదారులు అధ్వానం
- ఎత్తిపోతలు పూర్తి చేయలేదు

వైసీపీ పాలనలో నూజివీడు నియోజకవర్గానికి తీవ్ర అన్యాయం జరిగింది. కృష్ణా జిల్లాలోని నూజివీడు నియోజకవర్గం గతంలో సీఆర్‌డీఏలో భాగం. ఏలూరు జిల్లాలో విలీనం అనంతరం మారుమూల ప్రాంతంగా మారింది. ఫలితంగా నియోజకవర్గంలో రియల్‌ఎస్టేట్ రంగం తీవ్రంగా దెబ్బతింది. కృష్ణా జిల్లా పరిధిలో అతిపెద్ద డివిజన్‌గా ఉన్న నూజివీడు, ఏలూరు జిల్లాలో కేవలం ఆరు మండలాలకు పరిమితమైంది. కేంద్రీయ విద్యాలయం, మ్యాంగో పల్ప్ యూనిట్ ఏర్పాటులో ప్రభుత్వం విఫలమైంది. నూజివీడు మున్సిపల్ నిధులను కేంద్రీయ విద్యాలయం తాత్కాలిక భవనాల పేరిట దాదాపు రూ.80 లక్షలు ఖర్చు చేశారు. మంజూరు కాని కేంద్రీయ విశ్వవిద్యాలయానికి రెండేళ్ల క్రితమే నిధులు ఖర్చు చేయడం విస్మయం కలిగించింది. ఎట్టకేలకు మంజూరైనా ఏర్పాటు చేసే సమయానికి ఎన్నికలు సమీపించాయి.

రహదారులు రివర్స్ టెండరింగ్

టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు రూ.40 కోట్లతో ప్రారంభించిన అంతర్గత రహదారులను రివర్స్ టెండరింగ్ పేరుతో వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. నూజివీడు - విజయవాడ ప్రధాన రహదారి విస్తరణ పనులు ప్రారంభించి మూడున్నరేళ్లు దాటుతున్నా నేటికి నిర్మాణం పూర్తికాలేదు. తెలంగాణ నుంచి గన్నవరం విమానాశ్రయానికి అనుసంధానమయ్యే రహదారులు అధ్వానంగా మారాయి. సత్తుపల్లి - విస్సన్నపేట, నూజివీడు, గన్నవరం రహదారులు ధ్వంసమై ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మల్లవల్లి ఇండస్ట్రియల్ కారిడార్‌ను అనుసంధానించే హనుమాన్‌జంక్షన్ - ఈదుల గూడెం, ఈదులగూడెం - మల్లవల్లి రహదారి అభివృద్ధికి నోచుకోలేదు. ఆగిరిపల్లి - నూగొండపల్లి రహదారిపై వంతెన నిర్మాణం, ఆగిరిపల్లి - తోటపల్లి మధ్య వంతెన నిర్మాణం లేక వర్షాకాలం వాగు పొంగి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. చాట్రాయి మండలం విస్సన్నపేట - చింతలపూ డి రహదారిలో నరసాపురం నుంచి తమ్మిలేరు ప్రాజెక్టు వరకు సింగిల్‌రోడ్డు మాత్రమే ఉంది. దీన్ని డబుల్ రోడ్డుగా మార్చాలని ఎన్నో ఏళ్లుగా ప్రజలు కోరుతున్నా పాలకులు పట్టించుకోలేదు. చాట్రాయి సెంటర్ నుంచి కొండపర్వ అడ్డరోడ్డు వద్ద ఎం అండ్ కె రోడ్డు డబుల్ రోడ్డుకు మూడేళ్ల క్రితం సర్వే చేశారు. పనులు మాత్రం ప్రారంభించలేదు.

తమ్మిలేరుపై కాజ్‌వే కల

చాట్రాయి మండలం పోలవరం, చింతలపూడి మండలం యడవల్లి మధ్య తమ్మిలేరుపై కాజ్‌వే నిర్మించాలని 50ఏళ్ళ నుంచి ప్రజలు కోరుతున్నా కార్యరూపం దాల్చలేదు. నూజివీడు మండలంలో మీర్జాపురం కేంద్రంగా రామిలేరు రిజర్వాయర్‌ను ఏర్పాటు చేస్తామని గతంలో ఇచ్చిన

ట్రిపుల్ ఐటీ సమస్యలు పట్టవా జగనన్నా..



ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసిన జగనన్నకు నూజివీడు ట్రిపుల్ ఐటీ సమస్యలు కనిపించాయి. పరిష్కరించేస్తానని హామీ ఇచ్చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ సమస్యల కనిపించలేదు. అందుకే పరిష్కారం కాలేదు. మెంటార్లను పర్మినెంట్ చేస్తానని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చారు. వారంతా కళ్లలో ఒత్తులేసుకుని ఐదేళ్లు ఎదురు చూశారు. చివరికి జగనన్న వారికి నిరాశే మిగిల్చారు. మ్యాంగ్ పల్ప్ యూనిట్ ఏర్పాటుతో మామిడి రైతులకు ఊతం, స్థానికులకు ఉద్యోగావకాశాలు వస్తాయని ఎదురుచూస్తే మరోసారి ఎన్నికలు వచ్చాయి..!

అప్పటి పనులు.. మళ్లీ శంకుస్థాపన

హామీ అమలు కాలేదు. ముసునూరు మండలంలో రమణక్కపేట, గోపవరం గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రహదారులను రివర్స్‌టెండరింగ్ పేరుతో నిలిపివేశారు.

టీడీపీ ప్రభుత్వంలో మంజూరైన పలు అభివృద్ధి కార్యక్రమాలను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తిరిగి జల జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికి పైప్‌లైన్, మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల ఏర్పాటు పేరుతో గ్రామీణ ప్రాంతాలో ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. తర్వాత కోడ్ అమలుతో పనులు నిలిచిపోయాయి.


చింతలపూడి ఎత్తిపోతలలో భాగంగా తమ్మిలేరుపై చీపురుపల్లి వద్ద అక్విడెక్ట్



ఎత్తిపోతల పథకం నీటి మూట..!

చింతలపూడి ఎత్తిపోతల పథకం హామీ ఉత్తిపోతల నీటి మూటగా మిగిలింది. ప్రతి ఎకరానికి నీరుపారేలా చేస్తానని జగన్ ఇచ్చిన హామీ అమలు కాలేదు. చింతలపూడి ఎత్తిపోతల పథకంతో పాటు చాట్రాయి మండలం తమ్మిలేరు జలాశయ అభివృద్ధి, సాగర్ కాలువల ద్వారా చివరి ఆయకట్టుకు నీటిని తీసుకువస్తానని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నీటిమూటలుగా మారాయి. గత టీడీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూ.4వేల కోట్లతో చింతలపూడి ఎత్తిపోతల పథకం దాదాపు 60 శాతం పనులు పూర్తిచేసింది. ప్రభుత్వం మారడంతో వైసీపీ ప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతలకు పథకానికి నీళ్లొదిలింది.

తమ్మిలేరు జలాశయం అభివృద్ధి లేదు

చాట్రాయి మండలంలోని తమ్మిలేరు జలాశయం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో జపాన్ బ్యాంకు నిధులు రూ.16కోట్లు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో పనులు మొదలు కాలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక 2021లో టెండర్లు పిలిచి సుమారు రూ.50 లక్షల పనులు చేశారు. అనంతరం బిల్లులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. తమ్మిలేరు జలాశయం అభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది.



నెరవేరని హామీలు..

- నియోజకవర్గంలో జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు, గత ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు.
- ట్రిపుల్ ఐటీ సమస్యలను పరిష్కరిస్తానని, మెంటార్లను పర్మినెంట్ చేస్తానని, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని జగన్ హామీ ఇచ్చారు.
- చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామని, చాట్రాయి మండలం తమ్మిలేరు జలాశయాన్ని అభివృద్ధి, సాగర్ కాలువల ద్వారా చివరి ఆయకట్టుకు నీటిని తీసుకువస్తానని జగన్ హామీలు నీటిమూటలే.
- 200 ఎకరాల్లో మ్యాంగో పల్ప్‌యూనిట్ ఏర్పాటుద్వారా మామిడి రైతులకు మేలు చేస్తానన్న హామీ స్థల పరిశీలన దశలోనే నిలిచింది.
- వైద్య కళాశాల హామీకి సీఎం హోదాలో జగన్ ఫుల్‌స్టాప్ పెట్టారు. జిల్లాకు ఒక్క మెడికల్ కాలేజీ అని తేల్చడంతో జిల్లా కేంద్రం ఏలూరుకు మెడికల్ కళాశాల తరలిపోయింది
- నూజివీడు నుంచి జిల్లా కేంద్రాలను కలుపుతూ రహదారుల విస్తరణ హామీలు శిలాఫలకాలకే పరిమితం అయ్యాయి.
- నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో పంటలను నిల్వ చేయడానికి గోదాములను నిర్మిస్తామని హామీ నెరవేరలేదు.

ఐదేళ్లలో అభివృద్ధి మాటే లేదు



గత ఐదేళ్లలో ఎక్కడా అభివృద్ధి మాటే లేదు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారిని అడిగితే నిధులు లేవనే సమాధానం! అదేమంటే నిధులు లేవని చెబుతున్నారు. గ్రామాల్లో రహదారులు, వీధిదీపాలు వంటి మౌలిక సదుపాయాలు కూడా వైసీపీ ప్రభుత్వంలో కల్పించలేని దుస్థితి.

పర్వతనేని సాయికృష్ణ, ముక్కొల్లుపాడు

చింతలపూడిపై నీటి మూటలు



చింతలపూడి ఎత్తిపోతల పథకంపై నేతల హామీలు నీటి మూటలయ్యాయి. చింతలపూడి ఎత్తిపోతల పథకం రూ.400కోట్లు కాదు, రూ.4వేల కోట్లు అయినా పూర్తి చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక పట్టించుకున్న దాఖలా లేదు. వైసీపీ ప్రభుత్వానికి రైతు సంక్షేమం పట్టదు.

– లింగారెడ్డి వెంకటేశ్వరరావు, రైతు

తమ్మిలేరుపై పాలకుల నిర్లక్ష్యం



పాలకుల నిర్లక్ష్యంతో తమ్మిలేరు ప్రాజెక్టు శిథిలావస్థకు చేరింది. టీడీపీ హయాంలో రూ.16 కోట్లు మంజూరయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక రివర్స్ టెండరింగ్ పేరుతో టెండర్లు రద్దుచేసి కాలయాపన చేశారు. ఏడాదిక్రితం పనులు ప్రారంభించి అరకొరగా చేసి ఆపేశారు.

– చల్లగుళ్ళ శేషగిరిరావు, రైతు



• ఆత్మీయ పలకరింపులు

ఎన్నికల వేళ ఆత్మీయత పెల్లుబుతుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు కులాల వారీగా, వర్గాల వారీగా నాయకులు, కార్యకర్తలను ఆకట్టుకునేందుకు పోటీ పడుతున్నారు. ఇంటింటా ప్రచారం కంటే ఆత్మీయ సమావేశాలకే అభ్యర్థులు, నాయకులు ప్రాధాన్యం ఇస్తున్నారు. కొత్తగా పార్టీల్లో చేరిన వారిని పాత నాయకులను కలిపేందుకు కూడ ఆత్మీయ సమావేశాలనే ఎంచుకుంటున్నారు. కులాలు, వృత్తులు, ఇతర సంఘాల వారీగా ఆత్మీయ సమావేశాలతో అందరి సహకారం అవసరమన్న సందేశాన్ని అందిస్తున్నారు. సమస్యలను ఓపిగ్గా వింటూ అదెంత పని మన ప్రభుత్వం రాగానే పరిష్కరిస్తాం.. అంటూ చిటికె లేస్తున్నారు. ఎన్నికల వేళ ఆత్మీయత సమావేశాలు ఒక ఆయుధంగా మారాయి. – ముదినేపల్లి

ఉంగుటూరు.. ముగ్గురు ధర్మరాజులు

ఎన్నికల వేళ ధర్మం పాటిస్తారో లేదో వారికే ఎరుక. ఉంగుటూరులో ముగ్గురు ధర్మరాజులు ప్రజల ముందుకు వచ్చారు. అసెంబ్లీ స్థానానికి పోటీ చేసిన అభ్యర్థుల్లో ముగ్గురి పేర్లు ధర్మరాజు కావడం కాకతాళీయమా.. రాజకీయమా అనే చర్చ జరుగుతోంది. జనసేన నుంచి పత్సమట్ల ధర్మరాజు, జాతీయ జనసేన నుంచి పెద్దపూడి ధర్మరాజు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి పొట్ల ధర్మరాజు బరిలో ఉన్నారు. క్రమ సంఖ్యలు 4, 8, 11 నెంబర్లలో వారికి గుర్తులు కేటాయించారు. పుప్పాల శ్రీనివాసరావు (వైసిపి)కు తోడు కైకరం గ్రామానికి చెందిన అదే పేరుతో పుప్పాల శ్రీనివాసరావు స్వతంత్రగా బరిలో ఉన్నారు. వైసీపీ అభ్యర్థి పుప్పాల శ్రీనివాసరావుకు బ్యాలెట్‌లో రెండో నెంబరు రాగా స్వతంత్రుడికి 11వ నెంబరు, రబ్బరు స్టాంపు గుర్తు వచ్చింది. – ఉంగుటూరు



ఈవీఎం బటన్ నొక్కి..

బీప్ సౌండ్ గమనించాలి

ఓటు దుర్వినియోగం కాకుండా జాగ్రత్త పాటించండి

ఓటర్లు పోలింగ్‌బూత్‌లో ఈవీఎం బటన్ నొక్కి శబ్దం గమనించాలి. శబ్దం రాకుంటే ఓటు దుర్వినియోగమైనట్లు భావించవచ్చు. ఓటర్లు ఈవీఎం శబ్దంపై దృష్టి కేంద్రీకరించి, అనుమానం ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. రావడం లేదని కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుంటారు.

పోలింగ్ బూత్‌లో ముగ్గురు అధికారులు ఉంటారు.

మొదటి అధికారి మన వివరాలను పరిశీలించి ఒక స్లిప్ ఇస్తారు.

రెండో వారు ఓటరు సంతకం తీసుకుంటారు.

మూడో వారు ఓటరు చేతి వేలికి ఇంక్ మార్కు వేస్తారు.

ఈ అధికారి వద్దే ఈవీఎం మాస్టర్ కంట్రోల్ యూనిట్ ఉంటుంది. అదినొక్కినప్పుడే ఈవీఎం ఏక్టివేట్ అవుతుంది. అప్పుడు ఓటరు పరదా చాటునున్న ఈవీఎంలో నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలి. బటన్ నొక్కినప్పుడు ఒక శబ్దం వస్తుంది. వెంటనే పక్కనే ఉన్న వివిప్యాట్‌లో ఓటు వేసిన అభ్యర్థి పేరు, పార్టీ వివరాలు డిస్‌ప్లే అవుతాయి. బటన్ నొక్కినప్పుడు శబ్దం రాకపోతే ఓటు పడలేదని అర్థం. మూడో అధికారి ఈవీఎం మోనిటర్ కంట్రోల్ యూనిట్ ఏక్టివేట్ చేయలేదని అర్థం చేసుకోవాలి. వెంటనే ప్రశ్నించాలి. ఇదికూడా రిగ్గింగ్‌లో ఒక భాగమే. వృద్ధులు, కొత్త ఓటర్లు ఇది గమనించకుండా పోలింగ్ బూత్ నుండి వెళ్లిపోతారు. తరువాత బూత్‌లో ఉన్నవారు మన ఓటును దుర్వినియోగం చేస్తారు. వాళ్లకు నచ్చిన వారికి వేసుకుంటారు. ఓటు వేయడం మనహక్కు. దానిని జాగ్రత్తగా నిర్వర్తించాల్సి బాధ్యత మనపై ఎంతగానో ఉంది. ఏమైనా తేడా గుర్తిస్తే మాక్‌పోల్ స్లిప్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలి.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఇలా..



ఎన్నికల ప్రవర్తనా నియమావళి మొదట 1960లో కేరళ శాసనసభ ఎన్నికల్లో ప్రవేశపెట్టారు. తరువాత 1962 నుంచి లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా అమలవుతోంది. 1979 అక్టోబరులో అధికార పార్టీలను కూడా నియంత్రణ పరిధిలోకి తీసుకొచ్చారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రధానంగా 8 అంశాలతో ముడిపడి ఉంటుంది. ఎన్నికల నియమావళి ఎనిమిది అంశాలపై ఎన్నికల మేనిఫెస్టోలపై నిఘా ఉంటుంది.

- కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు ప్రచారంలో అధికార యంత్రాంగాన్ని ఉపయోగించకూడదు.
- అధికార పార్టీలు కొత్త పథకాలను, ప్రాజెక్టులను ప్రకటించరాదు.
- ప్రభుత్వ ఖర్చుతో పత్రికలు, మీడియాల్లో ప్రకటనలపై నిషేధం ఉంటుంది.
- మంత్రులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు అధికారిక కార్యక్రమాల పేరుతో ప్రచారాన్ని వినియోగించరాదు.
- బహిరంగ సభల నిర్వహణకు మైదానాలు, హెలిప్యాడ్ వినియోగంలో అధికారపార్టీ, అనుమతుల విషయంలో అన్నిపార్టీలకు నిబంధన వర్తిస్తుంది.
- ప్రభుత్వాలు ఎలాంటి తాత్కాలిక (అడ్‌హాక్) నియామకాలు చేయరాదు.
- ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో ప్రచారం చేయరాదు.
- ఎన్నికలకు 48 గంటల ముందు ఎలాంటి ప్రచారాలు చేయకూడదు.

– ద్వారకాతిరుమల

పెద్ద నోటు.. అబ్బో పెద్ద లోటు



ఎన్నికల్లో నగదు, మద్యం కీలకమే. నోటిఫికేషన్ మొదలు పోలింగ్ ముగిసే వరకు కార్యకర్తలను వెంట ఉంచుకోడానికి, ఫిరాయింపులు ఆడుకోడానికి వీటి అవసరం ఎంతో ఉంది. జేబులో చేయిపెట్టి నోటు తీస్తే కట్ట అంతా ఇవ్వాలని అడిగే రోజులు ఇవి. అభ్యర్థుల అదృష్టమో, ఓటరు దురదృష్టమో తెలియదు కాని ఈ సారి ఎన్నికల్లో పెద్ద నోట్లు కనిపించకుండా పోయాయి. 2014 ఎన్నికల్లో పెద్ద నోటు (1000) రాజ్యమేలింది. తరువాత నోట్ల రద్దుతో వెయ్యినోటు కనిపించడం లేదు. 2019 ఎన్నికలు నాటికి రూ.2000 నోటు వచ్చింది. ఇప్పుడు అదీ కనిపించడం లేదు. రూ. వెయ్యి, రూ.2000 నోట్లు ఘనంగా కనిపించాయి. చాలా వరకు జేబులోనే పెట్టుకుని ఎన్నికల కార్యకలాపాలు భేషుగ్గా నిర్వహించుకున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో పెద్ద నోట్లు లేకపోవడం అబ్బో.. పెద్ద లోటు అని కార్యకర్తలు, నేతలు సైతం ఊసురోమంటున్నారు. జేబులో చేయి పెడితే 500 నోటు, లేదా 200 నోటు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఒకటో రెండో అలాంటి నోట్లు ఇచ్చినా ఎవరూ సంతృప్తి పడడం లేదు. ఎన్ని నోట్లు ఇవ్వాలి.. కట్ట ఇచ్చేయాలా అని అభ్యర్థులు తలపట్టుకుంటున్నారు. – అత్తిలి

వలస ఓటర్లు ఎక్కడా..?

అభ్యర్థులు, నేతల ఆరా..



సార్వత్రిక ఎన్నికల సమరం ఊపందుకుంటుంది. పోలింగ్‌కు ఇంకా రెండు వారాల సమయం మాత్రమే ఉండడంతో గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. విజయావకాశాలపై అధికార, ప్రతిపక్షపార్టీల గ్రామస్థాయి నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. ఎలాగైనా గెలవాలని భావించి ప్రతి ఓటును కీలకంగా తీసుకుంటున్నారు. ఈనేపథ్యంలో స్థానికంగా ఉపాధిలేక వలస బాట పట్టిన ఓటర్లపై దృష్టి సారించారు. గ్రామ స్థాయిలో నాయకుల నుంచి వలస ఓటర్ల సమాచారాన్ని సేకరించి పోలింగ్ నాటికి వారిని స్వగ్రామాలకు రప్పించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. శాసనసభతోపాటు పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ ప్రక్రియ పూర్తి కావడంతో ప్రధాన పార్టీలు తమ అనుకూల ఓటర్ల వివరాలను స్థానిక నాయకులు ముఖ్య కార్యకర్తల ద్వారా తెలుసుకుని ఫోన్లో వారితో మాట్లాడుతూ పోలింగ్‌కు రావాలని కోరుతున్నారు. మండలంలోని అనేక గ్రామాల నుంచి వందల సంఖ్యలో ఉపాధి కోసం నగర, పట్టణ ప్రాంతాలకు వలస వెళ్ళారు. పోలింగ్ నాటికి వస్తారో రారో అన్న అనుమానంతో ముందస్తుగా వారి కోసం ఆరా తీస్తున్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడమే కాకుండా అది మనకు అనుకూలం అవుతుందన్న ఆశతో అభ్యర్థుల సూచనలతో అప్పుడే వలస ఓటర్లతో సంభాషణలు చేస్తూ వారు వచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. వలస ఓటర్లను ప్రసన్నం చేసుకుని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు రాయబారాలు నడుపుతున్నారు. ముదినేపల్లి మండలంలో సుమారు 49 వేల మంది ఓటర్లు ఉండగా, భవన నిర్మాణ రంగం, వ్యవసాయ పనులకు హైదరాబాద్, విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాలకే కాక, వివిధ ప్రాంతాలకు కూలి పనులకు వెళ్లిన వారు సుమారు 3 వేల మంది ఉండొచ్చన్నది నాయకుల అంచనా. వలస ఓటర్లను పోలింగ్ నాటికి తీసుకొచ్చేందుకు అన్ని పార్టీల వారు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. – ముదినేపల్లి / అత్తిలి

అద్దెకు కార్యకర్తలు..!



అద్దెకు కార్యకర్తలు.. వినడానికి కొత్తగా ఉన్నా.. ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు ఇది సర్వ సాధారణం. గతంలో రాజకీయ నాయకులు పిలిస్తే గ్రామీణ ప్రాంతాల నుంచి స్వచ్ఛందంగా ప్రచారానికి వెళ్లేవారు. ప్రస్తుతం నేతలు, ప్రజల ఆలోచన కూడా మారింది. నేతలపై జనానికి గౌరవం సన్నగిల్లింది. రాజకీయ కార్యకలాపాలు ఆర్థిక సంబంధాలయ్యాయి. రాజకీయ పార్టీలు ప్రచారానికి డబ్బులు ఇవ్వనిదే ముందుకు రావడం లేదు. జిల్లాలో ఇటీవల ఓ ప్రాంతంలో రెండు ప్రధాన పార్టీలు నిర్వహించిన ర్యాలీలు, సభలకు వచ్చిన జనం అంతా ఒక్కటే..! దీంతో తమ పార్టీల అభ్యర్థులు ఓటు వేస్తారా లేదా అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు.

జన సమీకరణ చేయాలంటే..

జన సమీకరణలో విఫలమైతే ప్రత్యర్థి పార్టీలు విమర్శలు గుప్పిస్తాయని భావించి ఆయా పార్టీల్లో జిల్లా నాయకులు, గ్రామ స్థాయి నాయకులపై లక్ష్యాలు విధిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకం పుణ్యమా అని ఎవరూ ఖాళీగా ఉండడం లేదు. దీంతో సభలకు వెళితే తమ ఆదాయానికి గండిపడుతుందని పార్టీ ప్రతినిధులకు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత్యంతరం లేక అద్దె కార్యకర్తలపై ఆధారపడాల్సి వస్తోంది. పురుషులకు రూ.600, మహిళలకు రూ.400 ఇచ్చి ప్రచారం చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం అద్దె కార్యకర్తలకు భలే గిరాకీ ఉంది. – అత్తిలి

గోడలపై రాతలు మాయం..



గతంలో ఎన్నికలు వచ్చాయంటే గోడ కనబడితే ఎన్నికల ప్రకటనలు కనిపించేవి. గోడలపై అభ్యర్థుల పేరు, పార్టీ, గుర్తు తదితర వివరాలు బొమ్మలుగా వేసేవారు. రెండు దశాబ్దాల ముందుకు చూస్తే ఎవరి గోడైనా సరే ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీల నేతలు మాకే ఓటు వేయండి అంటూ గోడలపై రంగులతో ప్రకటనలు రాయించేవారు. పార్టీల గుర్తు, ఎన్నికల గుర్తులతో నింపేసేవారు. ఎన్నికల కమిషన్ కొరడా ఝుళిపించడంతో గోడలపై రాతలకు అడ్డుకట్టపడింది. అనుమతి తీసుకోవాలని, గోడ రాతలకు పరిమితి విధించారు. పదేళ్ల క్రితంవరకూ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది ఆయా పార్టీల నాయకులు ఖాళీగా ఉన్న గోడలను రిజర్వు చేసుకునే వారు. పార్టీలో తమ అభ్యర్థులను ప్రకటించడమే ఆలస్యం. వెంటనే ప్రచార రాతలతో గోడలు నింపేసేవారు. ఎన్నికల సమయంలో వివాహం వంటి శుభకార్యాలు ఉన్నా సరే ఇంటింటికి రంగు వేయించుకునేందుకు యజమానులు వెనుకాడేవారు. కాలక్రమేణా గోడలపై రాతలు మారమయ్యాయి. సోషల్ మీడియా పుణ్యమా అని ప్రచార రాతలు కనుమరుగయ్యాయి. దీంతో అప్పటిదాకా గోడపై రాతలతో ఉపాధి పొందుతున్న కార్మికులకు కూడా పనిలేకుండా పోయింది. – అత్తిలి

జన కేతనం — ఆంధ్రజ్యోతి — 7
ఉమ్మడి పశ్చిమ గోదావరి
బుధవారం 1 మే 2024


అధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేక పోలీసు పరిశీలకుడు దీపక్ మిశ్రా

ప్రతి ఓటరు స్వేచ్ఛగా ఓటు వేయాలి

ప్రత్యేక పోలీస్ పరిశీలకుడు దీపక్ మిశ్రా

ఏలూరుసిటీ, ఏప్రిల్ 30: ఎన్నికల నేపథ్యంలో విధి నిర్వహణ ఎంతో కీలకమని, ప్రజాస్వామ్య పరిరక్షణే మన లక్ష్యమని రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక పోలీస్ పరిశీలకుడు దీపక్ మిశ్రా పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఏలూరు కలెక్టరేట్‌లో అదనపు డీజీపీ శంఖబ్రత బాగ్చి, జిల్లా ఎన్నికల పోలీస్ పరిశీలకుడు శ్రీధర్, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్, ఎస్పీ మేరీప్రశాంతి, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. దీపక్ మిశ్రా మాట్లాడుతూ ఓటర్లు స్వేచ్ఛగా నిర్భయంగా ఓటుహక్కు వినియోగించు కునేలా పోలీసులు విధులు నిర్వర్తించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసు కోవాలన్నారు. ఓటరు స్లిప్‌ల పంపిణీ, హోమ్ ఓటింగ్‌పై తీసుకున్న చర్యల గురించి అడిగారు. ఈవీఎంల తరలింపు సమయంలో సంబంధిత వాహనాలకు ముందు బ్యాక్ కెమేరాతో వీడియో చిత్రీకరణ చేయాలని మార్గమధ్యలో ఎక్కడా వాహనాన్ని నిలుపుదల చేయకూడదని స్పష్టం చేశారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద వీడియో రికార్డింగ్, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వివరించారు. జిల్లాలో సజావుగా ఎన్నికల నిర్వహణ కోసం రెండు షిఫ్టులలో 46 ఫ్లైయింగ్ స్క్వాడ్స్, 24 వీడియో సర్వే లెన్స్ టీమ్‌లు, 36 స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశా మన్నారు. ఎస్పీ మేరి ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో 1082 ప్రాంతాల్లో 1743 పోలింగ్ కేంద్రాలు ఉండగా సమస్యా త్మక పోలింగ్ కేంద్రాలు 415 ఉన్నట్లు తెలిపారు. అంతర్రాష్ట చెక్ పోస్టులు 8 ఏర్పాటు చేయగా మరో 22 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిర్వహ ణలో భాగంగా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను హెల్ప్‌లైన్‌తో ఏర్పాటు చేశామన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్య వేణి, అదనపు ఎస్పీ స్వరూపరాణి, డీఆర్వో పుష్పమణి,సెబ్ జాయింట్ డైరక్టర్ సూర్యచంద్రరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పరమేశ్వరన్, ఎల్‌డీఎం నీలాద్రి, పలువురు నోడల్ అధికారులు పాల్గొన్నారు.

నిబద్ధతతో విధులు నిర్వహించాలి

భీమవరం టౌన్ : ఎన్నికల విధులను పోలీసు వ్యవస్థకు వన్నె తెచ్చేలా నిర్వహించాలని ప్రత్యేక పోలీస్ పరిశీలకుడు దీపక్ మిశ్రా తెలిపారు. మంగళ వారం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్‌లో నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పోలీస్ అబ్జర్వర్ శైలేష్ కుమార్ సిన్హా, ఐజీ అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్లతో కలసి సమీక్షించారు.దీపక్ మిశ్రా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పోలీసులు నిష్పక్ష పాతంగా, నిర్భయంగా ప్రజల సంరక్షణ కోసం తమ అధికారాలను వినియోగించాలన్నారు. నిబద్ధతతో పనిచేయాలన్నారు. వ్యక్తిగత అజెండాతో పనిచేసే వారిపట్ల నిఘా ఉంటుందని, వారిపై తక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ జిల్లాలోని వివిధ పర్యవేక్షణ బృందాల పనితీరు గురించి వివరించారు. అభ్యర్థులు చేసే ప్రచారం, ర్యాలీలపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రికార్డు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల భద్రతా ఏర్పాట్లను వివరించారు. అడిషనల్ ఎస్పీ భీమారావు, అడిషనల్ ఎస్పీ సెబ్ రవి కుమార్, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కె.సంగీత్ మాధుర్, అధికారులు పాల్గొన్నారు

విస్తృతంగా ఎస్ఈబీ తనిఖీలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 30 : ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లా ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించారు. చింతలపూడి, భీమడోలు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం, ఏలూరు, కైకలూరు చెక్ పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహించారు. నాటుసారా తయారీ, విక్రయదారులపై ఐదు కేసులు నమోదులు చేసి వారి నుంచి 37 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 1500 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం చేసి రెండు కేసులు నమోదు చేశారు. డ్యూటీపెయిడ్ లిక్కర్ కల్గి ఉన్నవారిపై 11 కేసులు నమోదు చేసి 54.96 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 18 కేసులలో 26 మంది వ్యక్తులను అరెస్టు చేశారు.

మేనిఫెస్టో అదుర్స్

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఎన్నికల మేనిఫెస్టోపై అన్ని వర్గాల్లోనూ సంతృప్తి వ్యక్తమవుతోంది. సంక్షేమంతో కూడిన అభివృద్ధిపై కూటమి దృష్టి కేంద్రీకరించింది. ఇదివరకే సూపర్ సిక్స్ పథకాలతో కూటమి నేతలు ప్రజల్లోకి వెళ్లారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్వీర్యమైన వ్యవస్థలను, మూలనపడ్డ ప్రాజెక్టులను పూర్తి చేస్తామంటూ మేనిఫెస్టోలో చంద్రబాబు ప్రకటించారు. ఈ ఏప్రిల్ నుంచే వృద్ధులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు పెన్షన్ ఇవ్వనున్నట్టు కూటమి స్పష్టం చేసింది. పెన్షన్ పెంపు విషయంలోనూ వైఎస్ఆర్ కాంగ్రెస్ చతికిల పడింది. తల్లికి వందనంలో భాగంగా పాఠశాలల్లో చదువుకున్న పిల్లలందరికీ ఏడాదికి రూ. 15 వేలు వంతున అందజేయనున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కరికి మాత్రమే అమ్మఒడి అమలు చేస్తున్నారు. అదికూడా ఎన్నో నిబంధనలు పెట్టి తీసేశారు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి వస్తే ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలుంటే అందరికీ ఏడాదికి రూ. 15 వేలు అందజేస్తారు.

మహిళలకు మహాలక్ష్మి

మహాలక్ష్మి పథకం కింద 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ. 1500 ఇవ్వనున్నట్టు మేనిఫెస్టోలో స్పష్టం చేశారు. డ్వాక్రా మహిళలకు రూ. 10 లక్షల మేర ఉచిత వడ్డీకి రుణాలు ఇస్తామని ప్రకటించారు. స్వయం ఉపాధి యూనిట్‌లను ఏర్పాటు చేసి మహిళల ఆదాయం పెంచనున్నట్టు హామీ ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నారు.వైసీపీ హయాంలో ఉన్న పథకాలను కొనసాగిస్తేనే మరింత పెంచేలా కూటమి నిర్ణయం తీసుకుంది.

బీసీలకు ప్రాధాన్యం

బీసీలకు మేనిఫెస్టోలో అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. బీసీల స్వయం ఉపాధికి ఏటా రూ.10వేల కోట్లు కేటాయించనున్నారు. ఆదరణ పథకం కోసం రూ. 5వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు పంచాయతీల్లో రిజర్వేషన్‌లను 34 శాతా నికి పెంచనున్నారు. దీనివల్ల జిల్లాలో 100 పంచాయతీల్లో బీసీలకు అదనంగా ప్రాతి నిధ్యం లభించనుంది. అలాగే 50 ఏళ్లు దాటిన బీసీలకు నెలకు రూ. 4 వేలు పెన్షన్ ఇవ్వనున్నారు. దీనివల్ల జిల్లాలో దాదాపు లక్ష మంది బీసీలకు అదనంగా లబ్ధి చేకూర నుంది. మరోవైపు బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురానున్నారు. చట్ట సభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలంటూ కేంద్రానికి సిఫారసు చేయ నున్నట్టు చంద్రబాబు హామీ ఇచ్చారు.

ఉచిత ఇసుక విధానం

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఇసుక విధానం అమలు చేయ నుంది. దీనివల్ల నిర్మాణ రంగం ఊపందుకోనుంది. ఇసుక ధరలు తగ్గనున్నాయి. కేవలం రవాణా, తవ్వకం చార్జీలకే ఇసుక మార్కెట్‌లోకి రానుంది. వైసీపీ హయాంలో ఇసుక విధానం అస్తవ్యస్తమైంది. నిర్మాణ రంగం కుదేలైంది. భవన నిర్మాణ కార్మికులు కుదేలయ్యారు. నిర్మాణ అనుబంధ రంగాలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఇసుక ధరలు తగ్గించడం వల్ల నిర్మాణ రంగం జోరందు కుంటే అనుబంధ రంగాలు, వ్యాపార రంగాలు వృద్ధి చెందనున్నాయి.

అన్ని వర్గాల్లోనూ హర్షం

సంక్షేమంతో కూడిన అభివృద్ధి అంటూ కితాబు

సూపర్ సిక్స్ పథకాలతో ఇప్పటికే ప్రజల్లోకి



ఆక్వాకు జోష్

ఆక్వా రంగానికి చేయూతనిస్తూ మేనిఫెస్టో ప్రకటించారు.జోన్‌తో నిమిత్తం లేకుండా విద్యుత్ యూనిట్‌ను రూ.1.50 పైసలకే అందించనున్నారు.వైసీపీ హయాంలో రాయితీ మాటిలా ఉన్నా అన్ని విధాలుగా యూనిట్ ధర రూ.12లకు పైనే ఉంటోంది. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని కనెక్షన్‌లకు రాయితీ ఇవ్వనున్నారు. విద్యుత్ ఉపకరణాలకు రాయితీ కల్పిస్తారు. గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసు కుంటామని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు భరోసా ఇచ్చారు.

పోలవరంతో డెల్టా స్థిరీకరణ

పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామంటూ చంద్రబాబు ప్రకటించారు. దీనివల్ల పశ్చిమడెల్టా స్థిరీకరణ అవుతుంది. రబీలో సాగునీటి కష్టాలు తొలగిపోనున్నాయి. సమృద్ధిగా సాగునీరు అందనుంది. ఆక్వాకు నీటికి కొదవ ఉండదు. రైతులకు సాగు నీటి కష్టాలు ఇక ఉండవు. తెలుగుదేశం హయాంలో 72 శాతం పోలవరం ప్రాజెక్ట్ పూర్తయింది. వైసీపీ హయాంలో ప్రాజెక్ట్ నిర్మాణం నత్తకు మేనత్తను తలపించింది. తెలుగుదేశం కూటమి అధికారంలోకి వస్తే పోలవరం పరుగులు పెడుతుంది.

పంచాయతీరాజ్‌కు పూర్వ వైభవం

వైసీపీ హయాంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయ్యింది. నిధులు లేవు. సర్పంచ్‌లకు గౌరవం లేదు. చేసిన పనులకు బిల్లులు ఇవ్వలేదు. వేతనాలు ఇవ్వడం కూడా పంచాయతీలకు కష్టమైంది.విద్యుత్ బిల్లులు చెల్లించలేకపోయాయి. వాటి గౌరవాన్ని కాపాడేలా పంచాయతీరాజ్ వ్యవస్థను తీర్చిదిద్దుతామంటూ చంద్ర బాబు ప్రకటించడంతో పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు సంతృప్తి చెందుతున్నారు. వైసీపీలో ఆ పార్టీ సొంత సర్పంచ్‌లే విలవిల్లాడిపోయారు. గ్రామాల్లో కనీస మర్యాద లేకుండా పోయిందని వాపోయారు. కూటమితో పంచాయతీలకు మళ్లీ పూర్వ వైభవం రానుంది.

పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్

పీజీ కోర్సులకు కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయనుంది. వైసీపీ హయాంలో పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఎగ్గొట్టారు. దీనివల్ల జిల్లాలో దాదాపు 6 వేల మంది విద్యార్థులు పీజీ కోర్సులకు దూరమయ్యారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పీజీ విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వనున్నారు. అలాగే మెగా డీఎస్సీని ప్రకటిస్తామని కూటమి హామీ ఇచ్చింది. డీఎస్సీ లేకపోవడం వల్ల జిల్లాలో బీఈడీ కళాశాలలు మూత పడ్డాయి. శిక్షణ కేంద్రాలు కను మరుగయ్యాయి. డీఎడ్ కళాశాలలకు దిక్కులేకుండా పోయింది. ఇప్పుడవన్నీ పూర్వ వైభవాన్ని సంతరించుకోనున్నాయి.

అభివృద్ధి..సంక్షేమం రెండు కళ్లు

రఘురామ కృష్ణరాజు



మేనిఫెస్టోలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లగా ఉన్నాయి. జగన్ కంటే అత్యధిక సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వంలో రానున్నాయి. ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయి. తల్లికి వందనం, మహాలక్ష్మి పథకాలు మహిళలకు, విద్యార్థులకు ప్రయో జనం చేకూరుస్తాయి. పారిశ్రామికకరణతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. యువతకు ఉపాధిమార్గాలు మెరుగు పడ తాయి. జగన్‌మోహన్ రెడ్డి కంటే సంక్షేమం అధికం. దానికితోడు అభివృద్ధికి కూటమి పెద్దపీట వేసింది. రానున్న ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధిస్తుంది.

దళిత ద్రోహి జగన్ : జవహర్



ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 30: గత టీడీపీ ప్రభుత్వం దళితుల కోసం ప్రవేశపెట్టిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి జగన్ దళిత ద్రోహిగా మిగిలిపోయాడని మాజీ మంత్రి కేఎస్ జవహర్ అన్నారు. ఉమ్మడి మేనిఫెస్టో అన్ని వర్గాలకు మేల కలిగించేలా ఉందన్నారు. ఏలూరులో విలేకరులతో జవహర్ మాట్లాడుతూ ఇంకో 13 రోజుల్లో జగన్ పాలన అంతం కాబోతుందని జోష్యం చెప్పారు. జగన్ మాదిగలకు తీరని అన్యాయం చేశాడన్నారు. ఎస్సీ వర్గీకరణపై జగన్ ఏమీ మాట్లడకపోవడం మాదిగల పట్ల ఆయనకు ఉన్న ద్వేషభావం తెలియజే స్తుందన్నారు. ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి మాట్లాడుతూ గత ఎన్నికల్లో దళితుల ఓట్లతో గెలిచి దళితులకు తీరని అన్యాయం చేశారన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాలా బాలాజీ, లంకపల్లి మాణిక్యాలరావు పాల్గొన్నారు.



ప్రజలకు భరోసా : ఆరిమిల్లి

తణుకు, ఏప్రిల్ 30 :కూటమి మేనిఫెస్టో ప్రజలకు భరోసా కల్పించేవిధంగా ప్రజల ఆకాంక్షలకు అను గుణంగా ఉందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లా డారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు చేరువయ్యామన్నారు. ఐదువేల కోట్లతో ఆదరణ పథకం పున: ప్రారంభిస్తామన్నారు. వైసీపీ తీసుకొచ్చిన లాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేస్తామని వివరించారు. ప్రజల ఆస్తులను దోచుకోవడానికి ఈ యాక్టు తీసుకోచ్చారన్నారు. మీకు ఉండేవి 13 రోజులే అని ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇవ్వబోతున్నారన్నారు. సానుభూతి రాజకీయాలు మాని హుందాగా రాజకీయాలు చేయాలని కారుమూరికి సూచించారు. టీడీపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, కలగర వెంకటకృష్ణ, మంత్రిరావు వెంకటరత్నం పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంది



ఉమ్మడి మేనిఫెస్టో ప్రజల ఆకాంక్షలకు తగినట్లుగా ఉంది. రాష్ట్ర ప్రజలను భయపెడుతున్న ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేస్తామని చెప్పడం ద్వారా ప్రజల ఆస్తులకు భరోసా కల్పించినట్లయింది.ఈ యాక్ట్ ద్వారా అత్యధికంగా రెవెన్యూ యంత్రాంగానికి అధికారాలు కల్పించడం దుర్మార్గం.న్యాయవ్యవస్థ పరిధిని తగ్గించే విధంగా ల్యాండ్ టైటిల్ యాక్ట్ ఉంది.

-మురళీ గొల్లపల్లి, అడ్వకేట్, ఏలూరు

బ్రాహ్మణ సంక్షేమం దిశగా మేనిఫెస్టో



బ్రాహ్మణ సంక్షేమమే ధ్యేయంగా ఎన్‌డీఏ కూటమి మేనిఫెస్టో ఉంది. మేనిఫెస్టోతో బ్రాహ్మణ సమాజంలో పేదరికం నిర్మూలించవచ్చు. హిందూ దేవాలయాలు, సత్రాల ఆస్తుల పరిరక్షణకు హిందూ ఎండోమెంట్ బోర్డు హర్షనీయం.అర్చకులకు కనీస వేతన చట్టం తేవడం సంతోషం. హిందూ దేవాలయాల రక్షణకు చట్టం చేస్తామనడం మంచి పరిణామం.

-ఎంబీఎస్ శర్మ, బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు, ఏలూరు

మహిళలకు ఆర్థికంగా భరోసా



తాజా మేనిఫెస్టోలో మహిళలకు ఎంతో లబ్ధి చేకూరు తుంది. 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు ప్రతినెల రూ.1500, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం, అమ్మకు వందనం పథకం ద్వారా ఇంట్లో చదివే పిల్లలు అందరికి ఒక్కొక్కరికి రూ.15 వేలు వంటివి మహిళలకు ఆర్థికంగా భరోసా ఇస్తాయి.

-మద్దుల వాసంతి గృహిణి, ఏలూరు

మేనిఫెస్టో సూపర్



మేనిఫెస్టో చాలా బావుంది. యువగళం పథకం ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం, అధికారంలోకి వస్తే తొలి సంతకం మెగా డీఎస్సీ పైనే పెడతామని స్పష్టం చేయడం శుభపరిణామం.గతంలో వైసీపీని నమ్మి నిరుద్యోగ యువత మోసపోయారు. ఎన్నికల చివరి సమయంలో డీఎస్సీ ప్రకటించారు. ప్రతి నిరుద్యోగికి ప్రతి నెల రూ.3 వేలు యువగళం నిధి కింద నిరుద్యోగ భృతి, యువతకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు, ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ వంటివి అభినందనీయం.

-నిడమానూరి సురేష్‌కుమార్, ఏలూరు

బీసీలకు పెద్దపీట..హర్షణీయం



మేనిఫెస్టోలో బీసీలకు పెద్దపీట వేయడం చాలా ఆనందంగా ఉంది. బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం, 50 సంవత్సరాలకే పెన్షన్ సదుపాయం కల్పించడం హర్షనీయం. స్థానిక సంస్థలలోనూ, నామినేటెడ్ పోస్టులలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించడం,చట్ట సభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ కేంద్రానికి ప్రతిపాదనలు చేస్తామనడం హర్షనీయం.

-కిలపర్తి వెంకట్రావు, పెంటపాడు మండల టీడీపీ అధ్యక్షుడు

అన్ని వర్గాలకు న్యాయం



ఉమ్మడి కూటమి మేనిఫెస్టో చాలా బాగుంది. పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపయోగకరంగా ఉంది. దీనివల్ల అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుంది. ముఖ్యంగా బీసీలకు 50 సంవత్సరాలకే పెన్షన్ ఇస్తామనడం చాలా బాగుంది. ఈ పథకం వల్ల చాలా మంది పేద, సామాన్య ప్రజలు లబ్ధి పొందుతారు.

-రెడ్డి మసీనరావు, పెంటపాడు


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఇండియా కూటమి సభ్యులు

అబ్బయ్య చౌదరి నుంచి ప్రాణహాని

కలెక్టర్‌ను కలిసిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి

ఏలూరు కలెక్టరేట్, ఏప్రిల్ 30: దెందులూరు ఎమ్మెల్యే కొటారు అబ్బయ్యచౌదరి వల్ల తనకు ప్రాణహాని ఉందని పోలీసుల రక్షణ కల్పించాలని కోరుతూ ఇండియా కూటమి దెందులూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆలపాటి నరసింహమూర్తి మంగళవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. సోమవారం రాత్రి ఏలూరు రూరల్ మండలంలో ఎన్నికల ప్రచారం ముగించుకుని తిరిగి వస్తుండగా గంగన్నగూడెం గ్రామంలో వైసీపీ అభ్యర్థి అబ్బయ్య చౌదరి మీటింగ్ జరుగుతుండగా తమ వాహనాలు పక్కన పెట్టామన్నారు. ఇదే సమయంలో అబ్బయ్య చౌదరి వైసీపీ కార్యకర్తలను ప్రేరేపించి తమ కారు అద్దాలు పగుల కొట్టడమే కాకుండా మహిళా కార్యకర్తలను తీవ్రంగా గాయపరిచారని, కుల దూషణకు పాల్పడ్డారని ఆరోపించారు. ఘటనా స్థలంలోనే పోలీసులు ఉన్నా ఆపే ప్రయత్నం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రచారం చేసుకోనివ్వకుండా, హక్కులను హరిస్తున్న అబ్బయ్య చౌదరిపై కఠినచర్యలు తీసుకోవాలని, పోలీసులతో రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు, సీపీఐ నాయకులు ఉన్నారు.

జోష్..!

ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు ఏలూరు జిల్లాలోని దెందులూరు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కొయ్యలగూడెంలో పర్యటించారు. అక్కడ జరిగిన సభల్లో మాట్లాడారు. కూటమి పార్టీల అభ్యర్థులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. యువకులు , మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.


కొయ్యలగూడెం పవన్ సభలో...






విజయం మనదే : దెందులూరు చంద్రబాబు సభలో విక్టరీ చూపిస్తున్న జనం




ఊ.. : పవన్ సభలో యువతుల ఉత్సాహం

కూటమి గెలుపు రాష్ట్ర భవిష్యత్‌కు మలుపు

» ఏలూరు కూటమి అభ్యర్థి బడేటి బడేటి

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 30: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపు రాష్ట్ర భవిష్యత్తుకు గొప్ప మలుపు కానుందని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య(చంటి) పేర్కొన్నారు. మంగళవారం ఏలూరులోని 10, 33వ డివిజన్లలో ప్రజాసంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమికి రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా మెజారిటీని కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కూటమిని గెలిపించాల్సిన ఆవశ్యకత ప్రజలకు వివరించారు. వైసీపీ అరాచక పాలనతో ప్రజల్లో చైతన్యం వచ్చిందన్నారు. జగన్‌ను సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు ప్రకటించిన ఉమ్మడి మేనిఫెస్టో పట్ల ప్రజల్లో హర్షం వ్యక్తమవుతుందన్నారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి ఉమ్మడి అజెండా మార్గమన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌డీ బలరామ్, మనోజ్, మారం హనుమంతరావు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


ఏలూరు ప్రజాసంకల్పయాత్రలో మాట్లాడుతున్న బడేటి చంటి

మౌలిక సదుపాయాల కల్పనలో వైసీపీ విఫలం

ఉంగుటూరు కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు

భీమడోలు/గణపవరం, ఏప్రిల్ 30 : ప్రజలకు కనీస సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని ఉంగుటూరు నియోజకవర్గ కూటమి అసెంబ్లీ అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. జనంలోకి ధర్మరాజు కార్యక్రమంలో భాగంగా మంగళవారం భీమడోలు మండలం మల్లవరం, చెట్టున్నపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కూటమి మేనిఫెస్టో పథకాలను వివరించారు.

ఆగడాలలంకలో 700 కుటుంబాలు జనసేనలో చేరిక

ఆగడాలలంక గ్రామంలో 700 కుటుంబాలు జనసేన పార్టీలోకి చేరారు. జనంలోకి ధర్మరాజు కార్యక్రమంలో భాగంగా గ్రామానికి విచ్చేసిన పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 700 కుటుంబాలు జనసేనపార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరికి ధర్మరాజు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వైసీపీ గ్రామ ఉపాధ్యక్షుడు జయమంగళ రాధాకృష్ణ, మాజీ సర్పంచ్ చిగురుపాటి మంగళసోము, వెంకటేశ్వరరావు, గుండుగొలను సొసైటీ డైరెక్టర్ భలే విష్ణు, సైదు సోమరాజు నాయకులతో పాటు 1500 మంది పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ నేత సుబ్బారావు ఆధ్వర్యంలో జనసేన చేరికలు జరిగాయి. గణపవరం మండలం అర్ధవరంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు.


ఆగడాలలంకలో ప్రచారం చేస్తున్న పత్సమట్ల

కూటమి విజయానికి బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలి

ఏలూరుటూ టౌన్, ఏప్రిల్ 30: ఎన్‌డీఏ కూటమి విజయానికి బీజేపీ కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవా రం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారికి తపనా చౌదరి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జంగారెడ్డిగూడెం మండలం సొసైటీ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి, సత్యనారాయణ, శ్రీనివాసరావులతో సహా వారి అనుచరులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముచ్చటగా మూడోసారి మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమిదే విజయమన్నారు. జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్‌కిషోర్, సత్యనారాయణ, ఉండవల్లి వెంకట్రావు, జంగా వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన గారపాటి చౌదరి

జంగారెడ్డిగూడెంలో సొంగా రోషన్ భార్య ప్రచారం

బుట్టాయిగూడెం, ఏప్రిల్ 30 :టీడీపీ కూటమి ప్రకటించిన మేనిఫెస్టో ఆమోదయోగ్యంగా ఉందని. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళ్తుందని చింతలపూడి నియోజకవర్గ కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ సతీమణి విజయ పేర్కొన్నారు. మంగళవారం జంగారెడ్డిగూడెం పట్టణంలోని 2, 25వ వార్డుల్లో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో అభ్యర్థి రోషన్‌కుమార్ తండ్రి రాజా రాత్నంతో కలసి కూటమి నేతలతో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెంలో ప్రచారం చేస్తున్న విజయ

ఇష్టంతో చదివితే భవిష్యత్ బాగుంటుంది

పెదవేగి, ఏప్రిల్ 30 : ప్రతి విద్యార్థి ఎంతటి కష్టమైన విద్యనైనా ఇష్టంతో చదివితే ఆశించిన స్థాయిని చేరుకుంటారని యూటీఎఫ్ పెదవేగి మండలశాఖ అధ్యక్షుడు టి.ఎడ్వర్డు అన్నారు. పెదవేగి మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షా ఫలితా ల్లో ఆయా పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను యూటీఎఫ్ పెదవేగి మండలశాఖ ఆధ్వర్యంలో జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. మంగళవా రం ఈ సందర్భంగా ఎడ్వర్డు మాట్లాడుతూ విద్య ఉన్నతమైన భవిష్యత్‌ను అందిస్తుందన్నారు. యూటీఎఫ్ నాయకులు తేరా ప్రభాకరరావు, పొలిరెడ్డి వెంకటరమణ, మేకా లక్ష్మీనారాయణ, మోహనరావు, నరేంద్ర, నాగరాజు, కుమార్, స్వామి, త్రినాధ్, బి.వెంకటేశ్వరరావు, రెహమాన్, రామారావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

అప్పనవీడులో అన్నదానం

పెదపాడు, ఏప్రిల్ 30 :అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయస్వామి ఆలయం వద్ద దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించామని ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. సుమారు 200మంది భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ప్రసాదాలు స్వీకరించారు. మంగళవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా దేవాలయం వద్ద ఏర్పాట్లు చేశారు.

చంద్రబాబు సభకు తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు

పెదపాడు, ఏప్రిల్ 30 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దెందులూరులో నిర్వహించిన సభకు పెదపాడు మండలం నుంచి అధికసంఖ్యలో టీడీపీ శ్రేణులు మంగళవారం తరలివెళ్లారు. కొత్తూరు, పెదపాడు, గుడిపాడు, అప్పనవీడు, వట్లూరు గ్రామాలతో పాటుగా పలు గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు మోటారుసైకిళ్లు, కార్లపై ర్యాలీగా సభ జరిగే దెందులూరు ప్రాంతానికి కోలాహలంగా వెళ్లారు.

వైసీపీ ప్రచారంలో వలంటీర్

» పట్టించుకోని ఎన్నికల అధికారులు

పోలవరం, ఏప్రిల్ 30 : ఎల్లండీపేట గ్రామంలో మంగళవారం జరిగిన వైసీపీ ప్రచార కార్యక్రమంలో వాడపల్లి గ్రామానికి చెందిన సున్నం పోశీ అనే వలంటీర్ నేరుగా పాల్గొని వైసీపీ తరపున ప్రచారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వలంటీర్లు ప్రత్యక్షంగా గానీ పరోక్షంగాగానీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకూడదని కోర్టు ఇచ్చిన ఆదేశాలను తుంగలో తొక్కి వలంటీరు అధికార పార్టీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడం పట్ల సర్వత్రా పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాలుగు రోజుల క్రితం వైసీపీ పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిని నామినేషన్ కార్యక్రమాలకు సైతం 40 బైకులపై ర్యాలీ నిర్వహించే కార్యక్రమానికి ప్రాతినిథ్యం వహి ంచిన ఇదే వలంటీరుపై ఫొటోలు వీడియోలు ఉన్నా, పత్రికల్లో ప్రచురితమైనా ఎన్నికల కమిషన్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిప్పులగుండం తొక్కిన భక్తులు

దెందులూరు, ఏప్రిల్ 30 :గాలాయగూడెం గ్రామదేవత పూజారి వారి ఆడపడుచు నాగస్విని పేరంటాలమ్మ ఉత్సవాలు ముగిశాయి. మంగళవారం ఆలయ ఆవరణలో భారీ నిప్పులగుండంను ఏర్పాటు చేసి ఆలయ చైర్మన్ దంపతులు పూజారి అన్నవరం, దుర్గ, పూజారి శ్రీనివాసరావు నాగదుర్గ ఆధ్వర్యంలో పూజల అనంతరం నిప్పుల గుండంపై అమ్మవారి విగ్రహంతో నడవడంతో అనంతరం వందాలాది మంది భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భారీ అన్నసమారాధనలో భక్తులు పాల్గొన్నారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అలపాటి నరసింహమూర్తి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.


పేరంటాలమ్మ ఆలయం వద్ద నిప్పుల గుండం తొక్కుతున్న భక్తులు

ప్రచార వాహనంపై దాడికి చర్యలు తీసుకోవాలి

» తెలుగుదేశం పార్టీ నేతల డిమాండ్

లింగపాలెం, ఏప్రిల్ 30: కూటమి ప్రచార వాహనంపై జరిగిన దాడిపై చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ నేతలు డిమాండ్ చేశారు. బోగోలు గ్రామంలో సోమవారం రాత్రి టీడీపీ కూటమి ప్రచారవాహనంపై జరిగిన దాడిని ఖండిస్తూ తెలుగుదేశం నేతలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షుడు బొంతు గిరిబాబు చౌదరి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు తాడేపల్లి దాసు మాట్లాడుతూ వైసీపీ నాయకులు తమ ఓటమిని జీర్ణించుకోలేక తెలుగుదేశంపార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని చివరికి ప్రచార వాహనాలపై కూడా దాడులకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము కూడా దాడులు చేయగలమని కాని మా అది నాయకుడు చంద్రబాబునాయుడు తెలుగుదేశంపార్టీ కార్యకర్తలకు క్రమశిక్షణ అలవాటు చేశారన్నారు. ప్రచార వాహనంపై జరిగిన దాడిపై స్థానిక పోలీస్‌స్టేషన్ లోనూ, ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు మాదాసు కృష్ణ, రాప్రోలు రామ్మోహన్‌రావు, పలగాని రామకృష్ణ, వేంపాటి సత్యబాబు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

పవన్‌సభకు తరలివెళ్లిన కూటమి నాయకులు

కుక్కునూరు, ఏప్రిల్ 30 : జనసేన అధినేత పవన్ కల్యాణ్ సభకు జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కుక్కునూరు మండలం నుంచి కొయ్యలగూడెంకు భారీగా తరలివెళ్లారు. పదుల సంఖ్యలో వాహనాలు, కార్లపై తరలి వెళ్లారు, కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వై.యుగంధర్, ఎం.వెంకన్నబాబు, మంత్రి గోపాలకృష్ణ, లక్ష్మణస్వామి తదితరులు ఉన్నారు.


పవన్ సభకు తరలివెళ్లిన నాయకులు, కార్యకర్తలు

వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

» జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 30 : వేసవిలో వృద్ధుల ఆరోగ్యం పట్ల అత్యంత శ్రద్ధ తీసుకోవాలని ఏలూరు పత్తేబాదలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహ నిర్వాహకులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె రత్న ప్రసాద్ సూచించారు. మంగళవారం సాయంత్రం పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని ఆయన సందర్శించి అక్కడ వృద్ధులకు అందుతున్న వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలని వృద్ధులకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వసతి గృహంలో ఉన్న సభ్యులకు న్యాయసహాయం అవసరం అయితే జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచితంగా అందిస్తుందన్నారు.


వసతి గృహంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ఏలూరు క్రైం/ఏలూరు రూరల్, ఏప్రిల్ 30 : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, అదనపు ఎస్పీ జి.స్వరూపరాణి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలో హెలీప్యాడ్‌ను, అక్కడ నుంచి ఫైర్‌స్టేషన్ వరకు ఉన్న మార్గాన్ని పరిశీలించారు. ఫైర్‌స్టేషన్‌లో జరిగే ప్రాంతాన్ని పరిశీలన చేశారు. ఎస్పీతో పాటు స్పెషల్ బ్రాంచ్ సీఐ మల్లేశ్వరరావు, ఎఆర్ఆర్ఐ పవన్‌కుమార్ ఉన్నారు.

అమ్మో.. సీఎం పర్యటన.. హడలిపోతున్న జనం

ఏలూరు నగరంలోని ఫైర్‌స్టేషన్ సెంటర్లో సీఎం జగన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం జరిగే సిద్ధం సభలో పాల్గొంటారు. సీఎం పర్యటనతో ఏలూరు నగరవాసులు హడలెత్తిపోతున్నారు. ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. దాదాపు రెండు, మూడు కిలోమీటర్ల వరకు జనాలను రానివ్వకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తుంటారు. పోలీసులు దుకాణాలను మూసివేయడం, బారికేడ్లు పెట్టడం సర్వసాధారణంగా మారింది. . సీఎం ఉండేది గంట సమయమే అయినా ట్రాఫిక్ ఆంక్షలు తలచుకుని అమ్మో.. సీఎం సభ అంటూ బెంబేలెత్తుతున్నారు.

వరుడైన శ్రీనివాసుడు

» లక్ష్మీపురంలో ప్రారంభమైన కల్యాణోత్సవాలు

ద్వారకా తిరుమల, ఏప్రిల్ 30 : లక్ష్మీపురం సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుని దివ్య కల్యాణోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని, పరిసరాలను పుష్పమాలికలు, మామిడి తోరణాలతో సుందరీకరించారు. ఆలయ ముఖ మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి, అమ్మవార్ల కల్యాణ మూర్తు లను ఉంచి అర్చకులు ప్రత్యేక అలంకారాలు చేశారు. అనంతరం అర్చకులు, పండితులు. ఆగమ విద్యార్థుల వేదమంత్రోచ్చరణలు, మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ శ్రీనివాసుని పెండ్లికుమారుని, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా చేశారు. అధికసంఖ్యలో భక్తులు హాజరై తిలకించారు.



హామీలు నెరవేర్చని బీజేపీ ప్రభుత్వం

కుక్కునూరు, ఏప్రిల్ 30:కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ కేంద్ర కమిటీ నాయకులు కెచ్చెల రంగారెడ్డి, గోకినపల్లి వెంకటేశ్వరరావు ఆరోపించారు. మంగళవారం లచ్చిగూడెంలో ఆ పార్టీ ఎన్నికల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఎన్నికల్లో సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న సరియం రామ్మోహన్‌ను సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ ప్రజాపంథా బలపరుస్తుందన్నారు. డివిజన్ కార్యదర్శి ఎస్‌కే గౌస్, సుధాకర్, ధర్మల సురేష్, శిరికొండ రామారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి ఒకరి మృతి

భీమడోలు, ఏప్రిల్ 30 : భీమడోలులో నూతన భవన నిర్మాణానికి సెంట్రింగ్ పనులకు వెళ్లి ప్రమాదవశాత్తు భవనంపై నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాలివి.. భీమడోలు మండలం అంబరుపేట గ్రామానికి చెందిన నిట్టా వేణుబాబు (33)అనే వ్యక్తి భీమడోలులోని భవన నిర్మాణ సెంట్రింగ్ పనుల నిమిత్తం వెళ్లాడు. భవనంపై సెంట్రింగ్ బిగిస్తూ ప్రమాదవశాత్తు జారి కిందపడి తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య వాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతునిడి ఇద్దరు పిల్లలు ఉన్నట్టు తెలిపారు.


వేణుబాబు (ఫైల్)

ఎన్నికలకు అందరూ సహకరించాలి

ఉంగుటూరు,ఏప్రిల్ 30 :స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరిగేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు అందరూ సహకరించాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్ కోరారు. మంగళవారం స్థానిక రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఖాజావలితో కలసి ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ, నియమ నిబంధనలు, ఎన్నికల కోడ్‌పై అభ్యర్థులకు వారి ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉల్లంఘనలపై సీ-విజిల్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చన్నారు. అనంతరం ఉంగుటూరులోని పోలింగ్ కేంద్రాన్ని వారు పరిశీలించారు. మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. వేసవి దృష్ట్యా తాగునీరు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం పక్కనే ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.


ఉంగుటూరులో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్, రిటర్నింగ్ అధికారి ఖాజావలి


మహాప్రస్థానం పుస్తకాలను విద్యార్థులకు అందిస్తున్న అధ్యాపకులు

ఘనంగా శ్రీశ్రీ జయంతి వేడుకలు

కామవరపుకోట/చింతలపూడి, ఏప్రిల్ 30 : కామవరపుకోటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహాకవి శ్రీశ్రీ జయంతి వేడుకలను అధ్యాపకులు, విద్యార్థులు తెలుగు విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ చిత్రపటానికి కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు పూల మాలవేసి నివాళుల ర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ తెలుగు సాహిత్యానికి చేసిన సేవలను వివరించారు. అధ్యాపకులు కె.ఇందిర కుమారి, ఎం.ఉషారాణి, వి.శ్రీనివాస్, ధారావతు మల్లేష్, బి.వెంకటేశ్వరరావుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాకవి శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం కవితా సంపుటిలను విద్యార్థులకు అందజేశారు.

● చింతలపూడి, ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మహాకవి శ్రీశ్రీ జయంతి ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రాచీన కవులు, ప్రబంధ కవులు, ఆధునిక కవులపై విద్యార్థులకు వివరిస్తూ శ్రీశ్రీ రాసిన కవితలు, మహాప్రస్థానంపై మాట్లాడారు. ఆధునిక తెలుగు సాహిత్యానికి వన్నెతెచ్చిన ఆద్యుడు శ్రీరంగం శ్రీనివాసరావు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మహ్మద్‌ఆలీ, ఎ.సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు

విస్తృతంగా వాహనాల తనిఖీలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 30 : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ దాసరి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజామువరకు జిల్లాలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ జాతీయ, రాష్ట్రీయ రహదారులపై తనిఖీలు నిర్వహించారు. లాడ్జీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలోని అనుమానాస్పద వ్యక్తులను పరిశీలించారు. జిల్లాలో నేరాల నివారణకు పటిష్ఠమైన చర్యలు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో శాంతి భద్రతలను కాపాడేందుకు ముందస్తుగా ఆ ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేశారు. అంతేకాకుండా సాయుధ బలగాలతో గ్రామాల్లో కవాతును నిర్వహించారు.


అర్ధరాత్రి వేళ గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

1,43,703 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ఏలూరుసిటీ, ఏప్రిల్ 30 : జిల్లాలో ఇప్పటివరకు 1,43,703.44 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని జేసీ లావణ్యవేణి మంగళవారం వెల్లడించారు. జిల్లాలో నేటి వరకు 10,760 మంది రైతుల వద్ద నుంచి రూ. 276.14 కోట్లు విలువైన 1,43,703.44 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. కొనుగోలు ప్రక్రియ ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు 20,394 మంది రైతులకు చెందిన 1,60,279.440 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నమోదు చేసుకున్నారన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలులో ఏమైనా ఇబ్బందులు ఉంటే కంట్రోల్ రూమ్ నంబరు 08812-230448, 77020 03584, 75695 62076, 75695 97910 రైతులు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ఆత్మహత్యకు పాల్పడే వ్యక్తిని కాపాడిన రైల్వే పోలీసులు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 30 : ఇరవై లక్షల రూపాయల అప్పు తీర్చే మార్గం కానరాక రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంటున్నానని తన చెల్లికి ఫోన్ చేసి చెప్పడంతో ఆమె రైల్వే పోలీసులకు సమాచారమిచ్చింది. రైల్వే పోలీసులు యుద్ధ ప్రాతిపదికన రంగంలోకి దిగి అతడి ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన ఏలూరు నగరంలో జరిగింది. ఏలూరు చెంచుకాలనీకి చెందిన ముసునూరి కోటేశ్వరరావు తన అవసరాలు నిమిత్తం రూ.20 లక్షల అప్పు చేసి తీర్చలేక రైలు కిందపడి చనిపోతానని తన చెల్లి లక్ష్మీపార్వతికి ఫోన్ చేసి మంగళవారం ఉదయం చెప్పాడు. ఆమె వెంటనే రైల్వే ఎస్ఐ డి. నరసింహారావుకు చెప్పారు. ఎస్ఐ దేశాల మేరకు ఈ సమాచారాన్ని రైల్వే గ్యాంగ్‌మన్, కీమేన్‌లకు తెలిపి అప్రమత్తం చేశారు. మరోవైపు హెడ్‌కానిస్టేబుల్ రామారావు వెంటనే కోటేశ్వరరావు సెల్‌ఫోన్ లోకేషన్‌ను గుర్తించారు. పత్తేబాద ప్రాంతంలో ఉన్నాడని సిగ్నల్ చూపించడంతో కానిస్టేబుల్ విజయ్ వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి అతడిని గుర్తించారు. ఎస్ఐ నరసింహారావు అతడికి కౌన్సెలింగ్ చేశారు. అనంతరం అతడిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశాం

నిడమర్రు ఏప్రిల్ 30 : దాళ్వా ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. మంగళవాం చానమిల్లిలో రైతు భరోసా కేంద్రంను ఆయన సందర్శించి ధాన్యం కొనుగోలు విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిడమర్రు మండలంలో ఇప్పటివరకు పదకొండు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, గోనె సంచులు, లారీల కొరతను రెండు రోజుల్లో సరిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఏవో ఎస్. గీతాదేవి, వీఏఏ పి.శ్రీవాణి, సుధాకర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


చానమిల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన షేక్ హబీబ్‌బాషా

'ఓపెన్' పరీక్షల మోసంపై పీడీఎస్‌యూ ధ్వజం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 30 : ఏపీ ఓపెన్‌స్కూల్స్ దూరవిద్య టెన్త్, ఇంటర్ పరీక్షల్లో 'పాస్ గ్యారెంటీ' దుమారం మరోసారి తెరపైకి వచ్చింది. కొన్ని విద్యాసంస్థలు ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో గ్యారెంటీగా పాస్‌చేయిస్తామని నమ్మబలికి అభ్యర్థులనుంచి అనధికారికంగా వేలాది రూపాయలు దోచుకున్నాయంటూ పీడీఎస్‌యూ జిల్లా నాయకులు ఆరోపించారు. మంగళవారం ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సంఘ ముఖ్య నాయకుల సమావేశంలో ఓపెన్ పరీక్షల దోపిడీపై చర్చించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కె.నాని ఓ పత్రికా ప్రకటనను విడుదలచేశారు. జిల్లాలోని కొన్ని అక్రిడిటేషన్ సెంటర్ల యాజమాన్యాలు ఇంటర్ పరీక్షల్లో 'పాస్ గ్యారెంటీ' పేరుతో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులనుంచి వేలాది రూపాయలు వసూలు చేశాయని పీడీఎస్‌యూ నాయకులు ఆరోపించారు. యాజమాన్యాల హామీలకు ఆశపడిన విద్యార్థులు రూ.10వేల నుంచి రూ.20వేల వరకు చెల్లించారని వివరించారు. పాస్ గ్యారెంటీగురించి యాజమాన్యాలను నిలదీస్తుంటే సప్లిమెంటరీ పరీక్షలకు మళ్లీ ఫీజులు చెల్లించి రాసుకుంటే ఎగ్జామినేషన్ సెంటర్‌లో మేనేజ్‌చేస్తామని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాయని పీడీఎస్‌యూ నాయకులు ఎం.క్రాంతి, పి.రాజు, యు.బాలాజీ, జి.యశ్వంత్ తదితరులు ఆరోపించారు. దీనిపై విద్యాశాఖ వర్గాలను వివరణ కోరగా 'విద్యార్థులనుంచి అధికమొత్తాల్లో యాజమాన్యాలు ఫీజులు వసూలుచేస్తున్నట్టు విద్యార్థులు లిఖితపూర్వక ఫిర్యాదు ఇస్తే విచారించి సంబంధిత ఏఐ సెంటర్ గుర్తింపును రద్దుచేస్తామని, ఇంతవరకు ఎవరూ ఫిర్యాదుచేయలేదు.. బాధితులు ఫిర్యాదు ఇవ్వకుండా ఎటువంటి చర్యలు చేపట్టలేం' అని వివరించాయి.

డీసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 30 : ప్రభుత్వ విద్య, శిక్షణ సంస్థ(డైట్)లు, ప్రైవేటు ఎలిమెంటరీ టీచర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూషన్లలో రెండు సంవత్సరాల డీఎల్ఎడ్ కోర్సులో ప్రవేశాలకు అభ్యర్థుల ఎంపికకు నిర్వహించే డీసెట్-2024 ఆన్‌లైన్ పరీక్షకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో మే 9వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, మాన్యువల్ దరఖాస్తులను స్వీకరించబోరని వివరించారు.

వలంటీర్లను బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

పోలవరం, ఏప్రిల్ 30 : బలవంతంగా వలంటీర్లపై ఒత్తిడి తీసుకొచ్చి రాజీనామాలు చేయాలని బెదిరిస్తున్న వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నూతనగూడెంలో కూటమి జనసేన నాయకులు కొణతాల ప్రసాద్, టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మంగిన కొండ మాట్లాడుతూ వైసీపీ నాయకులు వలంటీర్లతో ప్రచారాలు నిర్వహించేందుకు సుప్రీంకోర్టు తీర్పు అడ్డుగా ఉన్న నేపథ్యంలో బలవంతంగా రాజీనామాలు చేయించి వారిని పార్టీ ప్రచారాలకు వాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈవిధంగా ఒత్తిడి తెస్తున్న వైసీపీ నాయకులపై ఎన్నికల కమిషన్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకులు మంగిన పోశీరత్నం, మేడుం పార్వతి, పట్నాల దేవి, పట్నాల నారాయణరావు, సోమరౌతు అనిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐ మల్లికార్జునరావు సేవలు అభినందనీయం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 30 : ఏఎస్ఐ మల్లికా ర్జునరావు సేవలు ఎంతో అభినందనీయ మని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. నూజివీడు ఏఎస్ఐ మల్లికార్జునరావు మంగళవారం పదవీ విరమణ చేసిన సందర్భంగా ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనతో పాటు సతీమణి బసవకుమారిలను ఎస్పీ మేరీ ప్రశాంతి, అదనపు ఎస్పీ స్వరూపరాణి ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌శాఖలో సుదీర్ఘకాలం పాటు విధులు నిర్వర్తించి ఎన్నో సమస్యలను ఎదుర్కొని ఆరోగ్యంగా, ఆనందంగా పదవీ విరమణ చేయడం అదృష్టమన్నారు. జిల్లా పోలీస్‌శాఖ తరఫున ఏఎస్ఐ మల్లికార్జునరావుకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సుఖసంతోషంగా గడపాలని సూచించారు. ఆర్ఐ పవన్‌కుమార్, పోలీస్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, ఏఎస్ఐ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


జ్ఞాపికను అందిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

అప్రకటిత విద్యుత్ కోతలు

» ప్రజల విలవిల.. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు తప్పని అవస్థలు

పోలవరం, ఏప్రిల్ 30 :పోలవరం మండలంలో అప్రకటిత విద్యుత్ కోతల తో ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. సోమవారం రాత్రి జగన్నాథపేటలో ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో విద్యుత్ శాఖ సిబ్బంది సమస్య పరిష్కారం కోసం కరెంట్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు ఉక్కబోత, దోమలతో అవస్థలకు గురయ్యారు. మంగళవారం తరచూ విద్యుత్ కోత విధించడంతో ప్రజానీకం, ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఫ్యాన్లు తిరగక, లైట్లు వెలగక రోగులు ఇబ్బందులకు గురయ్యారు. అందుబాటులో జనరేటర్ ఉన్నా వినియోగించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. జనరేటర్ వినియోగంపై పలువురు గ్రామస్తులు సిబ్బందిని ప్రశ్నించడంతో జనరేటర్ మరమ్మతులకు గురయింది తెలిపి మెకానిక్‌ను పిలిపించి జనరేటర్ వినియోగంలోకి తెచ్చారు. కరెంట్ కోతలపై విద్యుత్ శాఖ ఏఈ కె.సత్యనారాయణను వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురి కావడం, ఎక్కువ లోడు వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని, ఇక మీదట కరెంట్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.


ప్రభుత్వాసుపత్రిలో కరెంట్ లేక అవస్థలు పడుతున్న రోగులు

మేనిఫెస్టో కూటమి విజయానికి సోపానం



బొట్టు వంశీ, ఎన్నారై టీడీపీ నాయకుడు

చాట్రాయి: టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ మంగళవారం విడుదల చేసిన ఉమ్మడి మేనిఫెస్టో-2024 కూటమి విజయానికి సోపానం అవుతుందని ఎన్నారై టీడీపీ నాయకుడు బొట్టు వంశీ హర్షం వ్యక్తం చేశారు. చీపురుగూడెంలో మంగళవారం ఆయన 'ఆంధ్యజ్యోతి'తో మాట్లాడుతూ మేనిఫెస్టోలో పొందుపర్చిన యువత సంక్షేమం, మౌలిక వసతుల కల్పన, ప్రజా రాజధాని అమరావతి పునర్నిర్మాణం, సాగునీటి రంగం, పారిశ్రామిక పెట్టుబడులు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, చంద్రన్న బీమా, కాపు, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, మహిళా సంక్షేమం మొదలైన అంశాలు పేద, మధ్య తరగతి ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు తెస్తాయన్నారు. ప్రధాని మోదీ సహకారం, చంద్రబాబు విజన్, పవన్ కల్యాణ్ ఆశయాలు కార్యరూపం దాల్చి ఎన్నికల అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో సువర్ణాధ్యాయం మొదలు కాబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు.

తనిఖీల్లో రూ.2.07 లక్షలు స్వాధీనం

కైకలూరు, ఏప్రిల్ 30: ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా సరిహద్దులో కైకలూరు మండలం ఉప్పుటేరు వద్ద ఎన్నికల స్పెషల్ టీంలు వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేస్తుండగా రూ.2,07,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు కైకలూరు రూరల్ ఎస్సై టి. రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఎన్నికల ప్రత్యేక టీంలు ఈ తనిఖీలు నిర్వహించాయి. కలిదిండి మండలం తాడినాడ గ్రామానికి చెందిన పెన్మెత్స వెంకట రామకృష్ణంరాజు రూ.2,07,000లు నగదును కారులో తీసుకువెళ్తున్నట్లు గుర్తించారు. ఈ నగదుకు సంబంధించి ఎలాంటి ధ్రువీకరణపత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అయితే ఈ నగదును ఆక్వా చెరువులకు ఖర్చులు నిమిత్తం తీసుకువెళుతున్నట్లు రైతు పేర్కొన్నాడు. అయితే సంబంధిత ధ్రువీకరణపత్రాలు అందజేయాలని రైతుకు సూచించారు. స్వాధీనం చేసుకున్న నగదును కైకలూరు రిటర్నింగ్ అధికారి కె. భాస్కర్‌కు అప్పగించారు.

లక్ష పాంప్లెట్లు స్వాధీనం

కైకలూరు, ఏప్రిల్ 30: వివిధ రాజకీయ పార్టీలకు చెందిన లక్ష పాంప్లెట్‌లను సీజ్ చేసినట్లు కైకలూరు రూరల్ ఎస్సై టి. రామకృష్ణ తెలిపారు. మంగళవారం కైకలూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల సరిహద్దు అయిన ఉప్పుటేరు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల నిబంధన మేరకు జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి పలు రాజకీయ పార్టీలకు చెందిన లక్ష పాంప్లెట్లను గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు ఒక వ్యక్తి రూ.50 వేలుకు మించి నగదు తీసుకు వెళ్తే ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం నేరమని ఆ నగదును సీజ్ చేసి కేసు నమోదు చేస్తారని హెచ్చరించారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో మద్యం స్వాధీనం

ముదినేపల్లి, ఏప్రిల్ 30 : ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో ముదినేపల్లి మండలం కొత్తపల్లిలో అనధికార మద్యం అమ్మకాలు బయట పడ్డాయి. మంగళవారం డ్రైనేజీ ఏఈ భోగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహిస్తుండగా, అందిన సమాచారం మేరకు ఆ గ్రామంలో నిర్వహిస్తున్న బెల్టు షాపుల్లో సుమారు 7500 విలువైన 50 క్వార్టర్ బాటిళ్లను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు ఏ.రాజేష్‌ను అదుపులోకి తీసుకుని ముదినేపల్లి పోలీసులకు అప్పగించారు. ఏఎస్‌ఐ పద్మజ కేసు నమోదు చేశారు.



స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన రామన్

కైకలూరు, ఏప్రిల్ 30: సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలు వీవీ ప్యాట్‌లకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు కైకలూరు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు ఎస్ఏ రామన్ అన్నారు. మంగళవారం కైకలూరు మార్కెట్ యార్డులో ఈవీఎంల స్ట్రాంగ్ రూంను ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు నిరంతరం ఉండాలని అధికారులకు సూచించారు. అలాగే కైకలూరు ఆర్వో కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల ఖర్చులు, ఖాతాల నిర్వహణ, బ్యాంకు లావాదేవీలపై ఎన్నికల ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ పి. కీర్తినారాయణ్ రాజకీయ పార్టీ ఏజెంట్లకు, అధికారులకు అవగాహన కల్పించారు. ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, ఆర్వో కే. భాస్కర్, తహసీల్దార్లు పోతురాజు, వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.

మండవల్లి: మండవల్లి మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సాధారణ పరిశీలకుడు ఎస్ఏ రామన్ మంగళవారం పరిశీలించారు. మండవల్లి మండలం కొవ్వాడలంక పోలింగ్ కేంద్రం 10, 11, దెయ్యంపాడు గ్రామంలోని పోలింగ్ కేంద్రం 12, 13, 14లను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, ర్యాంప్‌ను పరిశీలించారు. పోలింగ్ రోజున ఓటర్లకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. ఆయన వెంట కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె. భాస్కర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ తదితరులు ఉన్నారు.



నూజివీడు ఏఎస్సైకి ఎస్పీ సత్కారం

నూజివీడు టౌన్, ఏప్రిల్ 30: నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ చేసిన పి.మల్లికార్జునరావును ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీప్రశాంతి ఘనంగా సత్కరించారు. పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం విధులు నిర్వర్తించి ఎన్నో సమస్యలను తట్టుకుని పదవీ కాలం పూర్తిచేయటం అదృష్టమన్నారు. ఈ సందర్భంగా ఏలూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో మల్లికార్జునరావుకు ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీస్ వెల్ఫేర్ ఆర్ఐ పవన్‌కుమార్, పోలీస్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, మల్లికార్జునరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కాగా నూజివీడు ప్రాంతంలో వివిధ హోదాల్లో పనిచేసిన మల్లికార్జునరావు, పట్టణ వాసుల్లో మల్లి అన్నగా పేరుపొందారు.

చెరువులు నింపడంలో అధికారులు విఫలం

కలిదిండి, ఏప్రిల్ 30 : తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపటంలో అధికారులు విఫలమయ్యారని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, కోరుకొల్లు సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ విమర్శించారు. మంగళవారం కోరుకొల్లులో ఆమె విలేకరులతో మాట్లాడుతూ సీబీ కెనాల్‌కు 400 క్యూసెక్కులు తాగునీరు విడుదల చేయాల్సి ఉండగా, 270 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల చేయటంతో చెరువులో 50 శాతమే నీరు నింపారన్నారు. దీంతో మే నెలలో చెరువులు అడుగంటి తాగునీటి ఎద్దడి ఏర్పడుతుందన్నారు. ప్రస్తుతం కోరుకొల్లు, చైతన్యపురంలో తాగునీటి చెరువులు అడుగంటుతున్నాయన్నారు.లంక గ్రామాల్లో కూడా 50 శాతం మాత్రమే చెరువులను నింపారన్నారు. నీటిని పూర్తిస్థాయిలో విడుదల చేసి తాగునీటి చెరువులను పూర్తిగా నింపాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

కలిదిండి, ఏప్రిల్ 30 : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో దినతేజ్, ఈవోపీఆర్డీ రాజారావు ఆదేశించారు. మంగళవారం మూల్లంకలో రోడ్డుపక్క చెత్త కుప్పలను ఎక్స్‌కవేటర్లతో యుద్ధప్రాతిపదికన తొలగించారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. అంతర్గత రహదారులపై మురుగు నీరు ప్రవహించకుండా ఉండాలంటే డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలన్నారు. సర్పంచ్ మహదేవ్ విజయ్, పంచాయతీ కార్యదర్శి నాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం అమ్మకాలపై నియంత్రణ

నూజివీడు టౌన్, ఏప్రిల్ 30: సారా తయారీ, అమ్మకందార్లపై కఠిన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో నల్లబెల్లం, బెల్లం వ్యాపారాలపై పూర్తి నియంత్రణ ఉందని, ఎస్ఈబీ సీఐ వెంకటరమణ తెలిపారు. నూజివీడు పట్టణంలోని బెల్లం వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడుతూ సారా తయారీదారులకు బెల్లం విక్రయించినట్లు నిర్ధారణ అయితే సంబంధిత విక్రయదారులపై కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఏమిటీ దా'రుణం'

మంచి వైద్యుడు.. మంచి స్నేహితుడు.. పైగా సౌమ్యుడు.. అంతకుమించి కుటుంబాన్ని అమితంగా ప్రేమించే మనిషి. అలాంటి ఓ వ్యక్తి తల్లి, భార్య, కూతురు, కొడుకును దారుణంగా హత్యచేసి, తాను ఆత్మహత్య చేసుకుంటాడా? పటమటలోని ఆర్థోపెడిక్ వైద్యుడు దారావత్ శ్రీనివాస నాయక్ ఆత్మహత్య, ఆయన కుటుంబం హత్యల వెనుక ఇలాంటి ఎన్నో ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఇంట్లో నిద్రపోతున్న భార్య ఉషారాణి, కుమార్తె శైలజ, తల్లి రమణమ్మ, కుమారుడు శ్రీహాన్ మెడ పైభాగంలో ఉన్న నరాలను కోసి దారుణంగా చంపేంత కర్కశత్వం ఆయనలో ఉందా? అసలు ఈ దారుణానికి కారణం అప్పులేనా? లేక ఎవరితోనైనా వైరమా? అనే కోణంలో పోలీసుల దర్యాప్తు సాగుతోంది.

- డాక్టర్ నాయక్ ఆత్మహత్య, కుటుంబ హత్యల వెనుక అనుమానాలు
- అప్పుల కారణంగానే ఈ దారుణానికి ఒడిగట్టారా? మరెవరితోనైనా వైరముందా?
- తన శ్రీజ ఆసుపత్రిని వేరొకరికి ఎందుకిచ్చారు ? తలచుకుంటే తీర్చలేనన్ని అప్పులా?
- మానసిక ఒత్తిడి వల్లేనని వాయిస్ మెసేజ్.. ఈఎంఐలు కట్టలేకపోయాడన్న స్నేహితుడు

విజయవాడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి):నూజివీడుకు చెందిన శ్రీనివాస నాయక్ గుంటూరులోని మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. ఆయన తండ్రి జమలయ్య నాయక్ మాజీ పోలీసు అధికారి. విజయవాడలో ఏసీపీగా పనిచేశారు. శ్రీనివాస నాయక్‌కు ఒక అన్నయ్య, ఒక చెల్లెలు ఉన్నారు. అన్నయ్య దుర్గాప్రసాద్ హైదరాబాద్‌లో న్యాయాధికారి. తండ్రి విజయవాడలో పనిచేసినప్పటి నుంచి ఆ కుటుంబం ఇక్కడే స్థిరపడిపోయింది. పటమటలోని ఫన్‌టైమ్స్ క్లబ్ వెనుక వీధిలో అభ్యుదయ జూనియర్ కళాశాలకు పక్కనే శ్రీనివాస నాయక్ సొంతింటిని నిర్మించుకున్నాడు. ఏడాది క్రితం దోర్నకల్ రోడ్డులో శ్రీజ ఆసుపత్రిని ప్రారంభించాడు. ఆ తర్వాత ఆర్థిక ఒడిదుడుకులు పెరగడంతో వేరే వైద్యులకు దీని నిర్వహణను అప్పగించినట్టు తేలింది. మొత్తం ముగ్గురు వైద్యులు శ్రీజను నడపడానికి నాయక్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఇందులో 90 శాతం వాటా వారిదని, పది శాతం వాటా నాయక్‌దని నిర్ణయించుకున్నారు. నాయక్‌కు ఆసుపత్రిలో ఒక చాంబర్ ఇచ్చినట్టు తెలిసింది. ఏప్రిల్ నెల 1వ తేదీ నుంచి ఈ ఆసుపత్రి నిర్వహణ కొత్త వ్యక్తుల చేతుల్లోకి వెళ్లినట్టు సమాచారం. అయితే, రాసుకున్న ఒప్పందం ప్రకారం కాకుండా ఉల్లంఘనలు ఏమైనా జరిగితే వివాదాలు మొదలయ్యాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఆసుపత్రి ఏర్పాటుకు సంబంధించి తీసుకున్న రుణాలకు ఈఎంఐలు చెల్లించడానికి నాయక్ ఇబ్బందులు పడుతున్నాడని, వాటిని చెల్లిస్తామని, నాయక్‌కు సహాయం చేస్తామని ఆసుపత్రి నిర్వహణ తీసుకున్నవారు చెప్పారని స్నేహితుడు డాక్టర్ భగవాన్ తెలిపారు.

కుటుంబ కలహాలా..?

తాను ఆత్మహత్య చేసుకోవడానికి ముందు శ్రీనివాస నాయక్ ఒక లేఖ రాశాడు. అందులో 'దిస్ ఈస్ మై కార్ కీ మేడమ్, ప్లీజ్ గివ్ ఓన్లీ టు శ్రీదుర్గాప్రసాద్ మై బ్రదర్' అని రాశాడు. దానికి ఫోన్ నంబరు రాసి, జడ్జి ఫ్రం హైదరాబాద్ అని పేర్కొన్నాడు. ఈ లేఖను, కారు తాళాలను ఎదురుగా ఉన్న ఇంటి గేటుకు ఉన్న ఉత్తరాల పెట్టెలో వేసి తిరిగి వెళ్లిపోతుండగా, ఇంటి యజమాని అప్పుడే మేల్కొని గమనించాడు. నాయక్‌ను పిలిచి ఏమిటని ప్రశ్నించాడు. లేఖ, తాళాలు తన అన్నయ్యకు అందజేయాలని, తాను ఇక ఉండనని చెప్పి వెళ్లిపోయాడు. ఆయన మాటల్లోని అర్థాన్ని ఎదురింటి యజమాని గమనించలేకపోయాడు. ఒక బ్యాగ్‌లో కొంత నగదు, బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్‌ను సర్ది కారులో పెట్టాడు. ఆ కారు తాళాల్నే ఎదురింట్లో ఇచ్చాడు. నాయక్‌కు ఇబ్రహీంపట్నం కొండపల్లిలో బంధువులు ఉన్నారు. అత్తమామలు అక్కడే ఉంటారు. ఈ లేఖ, తాళాలను దగ్గర్లోన్ని అత్తమామలకు కాకుండా దూరంగా ఉన్న అన్నయ్యకు అందజేయాలని రాశాడు. దీంతో కుటుంబ కలహాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అన్నదమ్ముల ఇద్దరి మధ్య పెద్దగా సత్సంబంధాలు ఉండవని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అయితే, శ్రీజ ఆసుపత్రిని ప్రారంభించినప్పుడు ఆయన అన్నయ్య ఆ కార్యక్రమానికి హాజరైనట్టు తెలుస్తోంది.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

అప్పుల విషయమేమీ తెలియదు : కుటుంబ సభ్యులు

కుటుంబ సభ్యులు నలుగురిని చంపడానికి డాక్టర్ నాయక్ రెండు కత్తులను ఉపయోగించాడు. వాటిని కొనుగోలు చేసిన రశీదు పోలీసులకు లభించింది. గురునానక్ కాలనీలో ఉన్న ఉషోదయ సూపర్ మార్కెట్‌లో వీటిని కొన్నట్టు తేలింది. దీనిప్రకారం ఒక పోలీసు బృందం సూపర్ మార్కెట్‌కు వెళ్లి సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించింది. ఘటన గురించి తెలియగానే శ్రీనివాస నాయక్ సతీమణి ఉషారాణి కుటుంబ సభ్యులు పటమటకు చేరుకున్నారు. ఉషారాణి తండ్రి రామాంజీ కుటుంబం ఇబ్రహీంపట్నం కొండపల్లిలో ఉంటోంది. రామాంజీ హెచ్‌పీసీఎల్ ఉద్యోగం చేసి రిటైరయ్యారు. రామాంజీ కుటుంబ సభ్యులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను చూడగానే కుప్పకూలిపోయారు. ఉషారాణి తల్లి బోరున విలపించారు. రామాంజీని పోలీసులు విచారించగా, కొన్ని విషయాలను వెల్లడించినట్టు తెలిసింది. తన అల్లుడికి ఆర్థిక ఇబ్బందులు ఉన్న విషయం తెలియదని ఆయన చెప్పారు. కొన్నాళ్ల క్రితం ఒక స్థలాన్ని విక్రయించి కొంత నగదు సమకూర్చినట్టు వెల్లడించారు.



డాక్టర్ శ్రీనివాస్ నాయక్ మృతదేహం

అప్పులు గురించి చెప్పినట్టయితే మరో స్థలాన్ని విక్రయించి తీర్చేవారమని తెలిసింది.

వాట్సాప్‌లో వాయిస్ మెసేజ్

'నేను మానసిక ఒత్తిడితో బాధపడుతున్నాను. నేనంటే కుటుంబ సభ్యులకు చాలా ఇష్టం. నేను లేకుండా వాళ్లు బతకలేరు. అందుకే కుటుంబ సభ్యులను చంపేసి నేను చనిపోతున్నా' ఇదీ డాక్టర్ శ్రీనివాస నాయక్ చేసిన వాట్సాప్ సందేశం. వాయిస్ రికార్డ్ ద్వారా ఈ సందేశాన్ని తన వాట్సాప్‌లో పోస్టు చేసుకున్నాడు. డాక్టర్ ఫోన్‌ను పరిశీలించినప్పుడు ఈ మెసేజ్ బయటపడింది.

చాలా మంచోడు : డాక్టర్ భగవాన్, స్నేహితుడు

నాయక్ చాలా మంచి వ్యక్తి. ఏడాది క్రితం శ్రీజ ఆసుపత్రిని ఏర్పాటు చేశాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. కొద్దిరోజుల క్రితమే దీన్ని మరొకరికి ఇచ్చాడు. ఇందులో 90 శాతం వారిది, పది శాతం వాటా నాయక్‌ది. ఆసుపత్రి ఏర్పాటుకు సంబంధించి తీసుకున్న రుణాలకు ఈఎంఐలు చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్నాడు. వాటిని చెల్లిస్తామని, ఆసుపత్రి నిర్వహణ తీసుకున్నవారు చెప్పారు.

ఎలాంటి లేఖ లభించలేదు : అధిరాజ్‌సింగ్ రాణా, డీసీపీ

ఘటనా స్థలంలో మాకు ఎలాంటి సూసైడ్ నోట్ దొరకలేదు. ఘటన మంగళవారం ఉదయం 6.30 గంటలకు ముందు జరిగి ఉంటుందని భావిస్తున్నాం. మాకు సమాచారం రాగానే వచ్చి చూడగా వరండాలో డాక్టర్ ఉరేసుకుని కనిపించాడు. తర్వాత లోపలకు వెళ్లి చూడగా మొదటి గదిలో రెండు, తర్వాత గదిలో ఒకటి, మూడో గదిలో ఒక మృతదేహం కనిపించాయి. ఆస్తులు, అప్పులకు సంబంధించిన డాక్యుమెంట్లను సీజ్ చేశాం. మరింత లోతుగా దర్యాప్తు చేస్తాం.





వైవాకలో ప్రచారం నిర్వహిస్తున్న కైకలూరు కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్.. భుజబలపట్నంలో కామినేని సతీమణి ప్రచారం

జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించండి : కామినేని

ముదినేపల్లి రూరల్, ఏప్రిల్ 30: జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ప్రతి ఒక్కరూ ఓటుతో సమాధానం చెప్పాలని కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఓటర్లను కోరారు. మంగళవారం ఊటుకూరు, వి. రావిగుంట, వైవాక, కొత్తపల్లి, వాడవల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన హయాంలో నియోజకవర్గానికి కోట్లాది రూపాయలు నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేశానన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఆయన కుమారులు ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధిని విస్మరించి దోచుకో... దాచుకో అన్న చందాన వ్యవహరించారని మండిపడ్డారు. కొత్త నాగేంద్రకుమార్, కొడాలి వినోద్, కొత్తూరు విఠల్, దావు నాగరాజు, బొంగు రవి, జనసేన మండల అధ్యక్షుడు వీరంకి వెంకటేశ్వరరావు, పోసిన పాండురంగారావు, వీరమల్లు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ స్టీరింగ్ కమిటీ సభ్యురాలు బీజేపీలో చేరిక

వైసీపీ స్టీరింగ్ కమిటీ సభ్యురాలు తిరువీధుల శారద మంగళవారం కైకలూరు కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ సమక్షంలో బీజేపీలో చేరగా కామినేని ఆమెకు బీజేపీ జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ అధికార పార్టీ ఎమ్మెల్యే ఆయన కుమారులు సొంత పార్టీ వాళ్లను సైతం అక్రమ కేసులు పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురి చేయడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూటమిలోకి వస్తున్నారని శ్రీనివాస్ పేర్కొన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని చేపల చెరువులను సైతం ఆక్రమించుకుని సన్న, చిన్నకారు రైతులను బెదిరించారని ఆరోపించారు. ప్రజలు అధికారాన్ని ఇచ్చింది సేవ చేయటానికి తప్ప అధికారం చెలాయించడానికి కాదని ఎమ్మెల్యే ఆయన కుమారులు గుర్తుంచుకోవాలని సూచించారు. పోల్ మేనేజ్‌మెంట్ నియోజకవర్గ కన్వీనర్ కొడాలి వినోద్, కొత్తూరు విఠల్, జాస్తి రాజా, బొంగు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కలిదిండి ఒకటో వార్డులో కూటమి నాయకులు ఇంటింటికి వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, జడ్పీటీసీ బొర్రా సత్యవతి,

కూటమి గెలుపుతోనే రైతుల సంక్షేమం

కైకలూరు: రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేసేది ఎన్డీయే కూటమి అని కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ సతీమణి మనోరమ అన్నారు. మంగళవారం భుజబలపట్నంలో ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ ప్రభుత్వంలో ఆక్వా, రైతుల అభివృద్ధికి చేసిన సేవలను వివరించారు. కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటే రానున్న రోజుల్లో ఆక్వా రంగానికి సబ్సిడీపై విద్యుత్ సరఫరా చేస్తారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, కూటమి నాయకులు కాంట్రాక్టర్ కృష్ణంరాజు, పొత్తూరి వాసురాజు, పేరిచర్ల ప్రసాదరాజు, ముదునూరి లింగరాజు, తెలుగు మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, తెంటు వెంకటరమణ, గుజ్జల రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని జంగంపాడు, పల్లిపాలెం, రాజులుకొట్టాడ గ్రామాల్లో అగ్నికుల క్షత్రియులతో కలసి ఇంటింటా ప్రచారాన్ని రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అండ్రాజు శ్రీనివాసరావు నిర్వహించారు. జగన్ ప్రభుత్వంలో మత్స్యకారులకు సంక్షేమ పథకాలు అమలు కాలేదని, ప్రకృతి వైపరీత్యాలు వరదలు వచ్చినప్పుడు మత్స్యకారులకు వలలు, పడవలు నష్టపోతే ఒక్క రూపాయి కూడా సాయం అందలేదన్నారు. డిస్ట్రిబ్యూటర్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ నాగిడి వీరబ్రహ్మం, అగ్నికుల క్షత్రియులు కొల్లాటి మహరాజు, మోకా వెంకటేశ్వరరావు, కొల్లాటి గోపాలరాజు, తిరుమలశెట్టి మణిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి



నూజివీడు టౌన్, ఏప్రిల్ 30: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో నూజివీడు అమర్‌భవన్‌లో శ్రీశ్రీ 111వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చలసాని రామారావు మాట్లాడుతూ శ్రీశ్రీ పేరు తలచుకోగానే కవిత్వం లావాలా ఎగసిపడి చైతన్యాన్ని తీసుకువస్తుందన్నారు. ప్రొఫెసర్ సూరి రామసూరి, త్రివిధ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అరసం జిల్లా కార్యదర్శి శిఖా ఆకాష్, దారా మోహన్‌రావు, శేషయ్య, చలసాని వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



పెన్షన్‌దారులు సచివాలయంకు రావద్దని ముదినేపల్లిలో దండోరా

సచివాలయాలకు రావద్దహో..

- పెన్షన్‌దారులకు ఫోన్లు చేయాలని ఆదేశాలు
- నంబర్లు లేక సిబ్బంది సతమతం
- దండోరా వేయించిన వైనం
- ప్రభుత్వ తీరుతో పింఛన్ కోసం వృద్ధులకు తప్పని పాట్లు

ముదినేపల్లి, ఏప్రిల్ 30: పెన్షన్ల సొమ్ము పెన్షనర్ల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలన్న ప్రభుత్వం నిర్ణయం పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయాల సిబ్బందికి పని భారాన్ని పెంచింది. అధికారులు, సిబ్బందికి ప్రభుత్వం కొత్త పనులు అప్పగించింది. పెన్షనర్లు పెన్షన్ తీసుకునేందుకు గ్రామ సచివాలయాలకు రానవసరం లేదని, వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామని, దివ్యాంగులు, అనారోగ్యంతో ఇంటి నుంచి రాలేని వారికి, వయో వృద్ధులకు ఇంటి వద్దే పెన్షన్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ విషయం గ్రామ సచివాలయాల సిబ్బంది ప్రతి పెన్షన్ దారుడికి ఫోన్ చేసి చెప్పాలని అధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఏ పెన్షన్ దారుడికి బ్యాంకుల్లో సొమ్ము జమ అవుతుంది.. ఎవరికి ఇంటి వద్ద పెన్షన్ ఇస్తామన్న విషయం ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయాల నుంచి ఆదేశాలు అందాయి. దీంతో ఈ ఉద్యోగులు ఫోన్‌లో సమాచారం ఎలా అందించాలన్నది సతమతమవుతున్నారు. ముదినేపల్లి మండలంలో 9139 మందికి ఇంటి వద్దే పెన్షన్లను అందిస్తారు. వీరందరికీ ఫోన్లు చేసి సచివాలయాలకు పెన్షన్ కోసం రావద్దని చెప్పాలి. అయితే అతి తక్కువ మంది పెన్షన్‌దారుల ఫోన్ నెంబర్లు మాత్రమే సిబ్బందికి తెలుసు. ఈ పరిస్థితుల్లో పెన్షన్ దారులకు ఫోన్ సమాచారం అందించే అవకాశం లేక ఉద్యోగులు ఇబ్బందుల నెదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలోని కొన్ని గ్రామాల్లో మంగళవారం ఈ సమాచారాన్ని దండోరా వేసి పంచాయతీ కార్యదర్శులు ప్రచారం చేయించారు.

చాట్రాయి మండలంలోనూ బ్యాంకులు దూరమే..

చాట్రాయి, ఏప్రిల్ 30: సామాజిక పెన్షన్ లబ్దిదారులకు మే నెలలో కూడా కష్టాలు తప్పటం లేదు. ఎన్నికల్లో లబ్ది కోసం ప్రభుత్వం వృద్ధుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నదని పలువురు విమర్శిస్తున్నారు. మండలంలో 18 గ్రామ పంచాయతీల పరిధిలో 8550 మంది పింఛనుదారులు ఉండగా వీరికి ప్రతి నెల రూ. 2.57 కోట్లు పంపిణీ చేస్తున్నారు. ఈ నెలలో మండలంలో 1452 మంది దివ్యాంగులు, 80 ఏళ్ళు దాటిన వృద్ధులు, మంచానికే పరిమితమైన వారికి సచివాలయ సిబ్బంది ఇళ్ళకు వెళ్ళి పింఛన్లు పంపిణీ చెయ్యాలని ప్రభుత్వం రూ. 55 లక్షలు విడుదల చేసింది. మిగతా 7098 మంది పెన్షన్ల లబ్దిదారుల ఖాతాలకు జమ చేస్తామని అధికారులు చెబుతున్నారు. మండలంలో చాట్రాయి, చనుబండ, పోలవరం, కోటపాడు గ్రామాల్లో మాత్రమే బ్యాంకులు ఉన్నాయి. మిగతా గ్రామాల లబ్ధిదారులు మండే ఎండల్లో 5 నుంచి 10 కిలోమీటర్లు దూరంలో ఉన్న బ్యాంకులకు వెళ్ళి గంటల తరబడి పడిగాపులు పడి పెన్షన్ సొమ్ము తెచ్చుకోవాల్సిన పరిస్థితి రావటంతో వృద్ధులు ఆందోళన చెందుతున్నారు. గ్రామ సచివాలయాల్లో ఇళ్ళకు వెళ్ళి పెన్షన్లు పంపిణీ చేయటానికి అవసరమైనంత మంది సిబ్బంది ఉన్నప్పటికీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పట్ల సర్వత్రా నిరసన వ్యక్తం అవుతున్నది.

నేటి నుంచి ఇంటింటికీ పెన్షన్ల పంపిణీ

ముదినేపల్లి, ఏప్రిల్ 30 : ముదినేపల్లి మండలంలోని దివ్యాంగులు, అస్వస్థతతో మంచంలో ఉన్న వారికి బుధవారం నుంచి ఇంటింటికి వెళ్లి పెన్షన్‌ను అందజేయనున్నట్లు ఎంపీడీవో మురళీ.గంగాధరరావు తెలిపారు. మండలంలో 2259 మంది పెన్షన్‌దారులకు ఇంటింటికి వెళ్లి సొమ్మును పంపిణీ చేసేందుకు రూ.64 లక్షలు బ్యాంక్ నుంచి డ్రా చేసి సిద్ధం చేసినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పెన్షన్లను అందజేస్తారని ఎంపీడీవో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చాట్రాయి, ఏప్రిల్ 30: మండలంలోని చనుబండ విద్యుత్ సబ్ స్టేషన్‌లో భారీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున 1వ తేదీ బుధవారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు చనుబండ, సూరంపాలెం, కృష్ణారావుపాలెం, నరసింహారావుపాలెం, సి. గుడిపాడు గ్రామాల్లో త్రీ ఫేజ్ కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ ఏఈ సంజయ్ తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

రేపు ముదినేపల్లి మండల పరిషత్ సమావేశం

ముదినేపల్లి, ఏప్రిల్ 30 : ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం మే 2న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో మురళీ గంగాధర్‌రావు తెలిపారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని అన్నారు.

3న కైకలూరులో పవన్ కల్యాణ్ బహిరంగ సభ

కైకలూరు, ఏప్రిల్ 30: ఈ నెల 3వ తేదీన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ కైకలూరులో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. 3వ తేదీ ఉదయం 10 గంటలకు కైకలూరులో బహిరంగ సభ ఉంటుందని, అందుకు హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్నామన్నారు. ఈ బహిరంగసభకు నియోజకవర్గ వ్యాప్తంగా జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

8న పట్టుబడిన వాహనాల వేలం

నూజివీడు టౌన్, ఏప్రిల్ 30: నూజివీడు సెబ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన వాహనాలను మే 8న వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ వెంకటరమణ తెలిపారు. మొత్తం 16 వాహనాలకు వేలం నిర్వహిస్తామని, వేలంలో పాల్గొనే వారు ఆధార్ కార్డు నకలును తీసుకుని ధరావతు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. వేలం వాహనాలు దక్కించుకున్న వారు వాహన సొమ్మును వెంటనే చెల్లించవలసి ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 94409 02462 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

పర్వతనేని శ్రీధర్‌కు కామినేని నివాళి

ముదినేపల్లి, ఏప్రిల్ 30 : ఇటీవల బీజేపీలో చేరి ఎన్నికల ప్రచారంలో పాల్గొని సోమవారం నాడు గుండెపోటుకు గురై మరణించిన పర్వతనేని శ్రీధర్ భౌతిక కాయాన్ని మంగళవారంనాడు కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ముదినేపల్లిలో సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతిని ప్రకటించారు. టీడీపీ నాయకులు కొడాలి వినోద్, లింగమనేని భాను ప్రసాద్, బొప్పన సుందర రామయ్య, కొత్తూరు విఠల్, చలసాని జగన్మోహనరావు, ఈడే సుధాకర్, బీజేపీ నాయకులు పైడిపాటి శివశంకర్, కోటప్రోలు కృష్ణారావు, సత్యవోలు నాగలక్ష్మి తదితరులు శ్రీధర్‌కు నివాళులర్పించారు.

కిడ్నీ బాధితుడికి 'మానవత' చేయూత



నూజివీడు టౌన్, ఏప్రిల్ 30: కిడ్నీ బాధితుడికి వైద్య ఖర్చుల నిమిత్తం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సాయం అందించింది. నూజివీడు పట్టణం బాపూనగర్‌కు చెందిన నాగమల్లేశ్వరరావు కిడ్నీవ్యాధితో బాధపడుతూ వారానికి రెండుసార్లు డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. ఈ క్రమంలో అతని తండ్రి అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. అతని తల్లి బేబి దినసరి కూలీగా వచ్చే ఆదాయంతోనే కుటుంబాన్ని పోషించాల్సి రావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం నూజివీడు మానవత ప్రతినిధులు డయాలసిస్ నిర్వహణ నిమిత్తం రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఛైర్మన్ టి.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీయస్ ప్రధాన కార్యదర్శిగా రాంబాబు



ముసునూరు, ఏప్రిల్ 30: మండలంలోని లోపూడికి చెందిన డోలా రాంబాబు ఎమ్మార్పీయస్ నూజివీడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా నియమితు లయ్యారు. మంగళవారం లోపూడిలో ఎమ్మార్పీయస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ అధ్యక్షులు బయ్యవరపు రాజేష్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నమ్మిన నాగార్జున మాదిగ, జాతీయ నాయకురాలు సీహెచ్.విజయల సమక్షంలో డోలా రాంబాబును నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపిక చేసి, నియామక పత్రాన్ని అందజేశారు. వివిధ మండలాల సమితి నాయకులు రాంబాబుకు అభినందలు తెలిపారు.